విశాఖపట్టణం
శనివారం 8 ఆగస్టు 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:196 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## వాళ్లను ఉపేక్షించవద్దు


మెడికోలకు మెరుగైన వైద్యం అందించాలి

సీఎం, డిప్యూటీ సీఎం ఆదేశాలు

రాజమండ్రిలో హిట్ అండ్ రన్ కేసు



2




## టీడీపీకి తగ్గాయి.. వైసీపీకి పెరిగాయి!

రాజకీయ విరాళాల లెక్కింపులో విచిత్రం

బీఆర్ఎస్‌కు భారీగా తగ్గుదల

ప్రాంతీయ పార్టీల ఫండింగ్‌లో ఆసక్తికరం

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన ప్రాంతీయ పార్టీల రాజకీయ విరాళాల లెక్కలు ఆసక్తికర చిత్రాన్ని చూపిస్తున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో బీఆర్ఎస్‌కు విరాళాలు భారీగా తగ్గగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మాత్రం విరాళాల ప్రవాహం గణనీయంగా పెరిగింది. టీడీపీ విరాళాల్లో స్వల్ప తగ్గుదల నమోదవగా, ఎంఐఎం రూ.20 వేలకుపైగా ఒక్క విరాళాన్నీ ప్రకటించలేదు. అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ విడుదల చేసిన తాజా నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. ఏడీఆర్ నివేదిక ప్రకారం.. రూ.20వేలకుపైగా ప్రకటించిన విరాళాల్లో బీఆర్ఎస్ పార్టీకి భారీగా తగ్గుదల చోటు చేసుకుంది. 2024-25లో బీఆర్ఎస్‌కు రూ.20 వేలకుపైగా విలువైన కేవలం నాలుగు విరాళాల రూపంలో రూ.15 కోట్లు మాత్రమే వచ్చాయి. 2023-24లో మాత్రం ఎనిమిది ..మిగతా 2లో

# చేనేతకు పూర్వ వైభవం


చీరాల నైపుణ్యానికి దేశవ్యాప్త గుర్తింపు

కార్మికులకు తొలిసారిగా పెన్షన్ ఇచ్చింది మేమే

బీసీల బలంతోనే ఎన్డీఏ విజయం

సంక్షేమం, అభివృద్ధి మా లక్ష్యం

సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు







ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:

చేనేత కుటుంబాలతో కలిసి జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా 'నేతన్న సేవలో' పథకానికి శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. శుక్రవారం వేటపాలెం మండలం కొత్తపేటలో జాతీయ చేనేత దినోత్సవం కార్యక్రమంలో సీఎం పాల్గొని ప్రసంగించారు. చీరాలకు రావడం తన అదృష్టమన్నారు. అర్హులైన ప్రతి చేనేత కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయం అందజేస్తున్నామని.. మొత్తం 71,636 చేనేత కుటుంబాలకు పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. రూ.179 కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని తెలిపారు. చేనేత కార్మికులంటే తనకు ప్రత్యేక అభిమానమని సీఎం అన్నారు. చేనేత కార్మికుల కష్టాలు తనకు తెలుసని.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే చేనేత కోసం పోరాడామని గుర్తుచేశారు. చేనేత కేవలం వృత్తి కాదని.. భారతీయ సంస్కృతికి ప్రతీక అని తెలిపారు. దేశం గర్వించే కళ చేనేత అని అభివర్ణించారు. చీరాల చేనేతకు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని.. చీరాల పట్టు, కాటన్ చీరలకు విశేష ఆదరణ లభిస్తోందని తెలిపారు. ఒకప్పుడు చీరాల కర్చీఫ్‌లు విదేశాలకు ఎగుమతి అయ్యేవని చెప్పుకొచ్చారు. చేనేత రంగం కాలక్రమేణా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొందని తెలిపారు. చేనేతను ప్రోత్సహిస్తూ ..మిగతా 2లో

# విడాకుల కేసు ఉపసంహరణ

పిటీషన్ వెనక్కి తీసుకున్న సీఎం విజయ్ భార్య .. తమిళనాడు రాజకీయాల్లో అనూహ్య మలుపు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

తమిళనాడు రాజకీయాల్లో, సినీ వర్గాల్లో అత్యంత ఆసక్తి రేకెత్తించిన ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్, ఆయన భార్య సంగీత మధ్య నడుస్తున్న విడాకుల కేసులో అనూహ్య మలుపు తిరిగింది. తన వివాహ బంధాన్ని రద్దు చేయాలని కోరుతూ గతంలో దాఖలు చేసిన పిటిషన్‌ను సంగీత వెనక్కి తీసుకున్నారు. శుక్రవారం నాడు జరిగిన విచారణలో భాగంగా ఈ పరిణామం చోటుచేసుకుంది. తమిళనాడులోని చెంగల్పట్టు జిల్లా కోర్టులో పెండింగ్‌లో ఉన్న విడాకుల కేసును సంగీత పసంహరించుకోవడంతో, న్యాయమూర్తి ఆ కేసును కొట్టివేశారు. సంగీత ఈ విచారణకు వ్యక్తిగతంగా హాజరుకాకుండా, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు ముందు హాజరయ్యారు. పిటిషన్‌ను వెనక్కి తీసుకోవడానికి గల కారణాలను ఆమె న్యాయమూర్తికి వివరించినట్టు సమాచారం. ఈ పరిణామంతో ముఖ్యమంత్రి విజయ్ వైవాహిక జీవితంపై సాగుతున్న ఊహాగానాలకు ప్రస్తుతానికి తెరపడింది. వివాదం ఈ ఏడాది ఫిబ్రవరిలో ..మిగతా 2లో





## ఉత్తరాంధ్రకు వర్షగండం

రెండురోజుల పాటు భారీ వర్షాలు

వాతావరణంలో అనూహ్య మార్పులు

(అమరావతి - జయజయహే)

వాతావరణంలో అకస్మాత్తుగా తీవ్ర మార్పులు చోటుచేసుకుంటున్నాయి. వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో తదుపరి 24 గంటల వ్యవధిలో బలమైన అల్పపీడనం రూపుదిద్దుకోనుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. ఈ అల్పపీడన ప్రభావం వల్ల రాబోయే రెండు రోజుల పాటు రాష్ట్రంలో పిడుగులు, బలమైన ..మిగతా 2లో




## సీబీఐ విచారణ జరపాల్సిందే

డీఎస్సీలో అక్రమాలు వాస్తవం

మంత్రి లోకేశ్ రాజీనామా చేయాలి

రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ ర్యాలీలు

(తాడేపల్లి - జయజయహే)


డీఎస్సీ పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడిలో భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపిస్తూ, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని వైఎస్ఆర్‌సీపీ డిమాండ్ చేస్తోంది. గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిరుద్యోగ విద్యార్థి జేఏసీ ప్రతినిధులో సమావేశమై పార్టీ అధినేత వైఎస్ జగన్, అభ్యర్థుల భవిష్యత్ కోసం తాము పోరాడతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో గత ఏడాది నిర్వహించిన డీఎస్సీ -2025 నియామక ప్రక్రియలో అనే ..మిగతా 2లో

## బోఫోర్స్.. ఇక సుఖాంతం

ఏకైక అప్పీల్ ను కొట్టేసిన సుప్రీం

ఒకప్పుడు రాజకీయాలను కుదిపేసిన వ్యవహారం

విచారణ కోసం రూ. 250 కోట్ల ప్రజాధనం వృధా



(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

భారత రాజకీయాల్లో దాదాపు నాలుగు దశాబ్దాల పాటు పెను సంచలనాలు సృష్టించిన బోఫోర్స్ లంచాల వ్యవహారం చట్టపరంగా శాశ్వతంగా ముగిసిపోయింది! ఈ కేసులో సుప్రీంకోర్టులో మిగిలి ఉన్న ఏకైక అప్పీల్‌ను కూడా సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేస్తూ గురువారం తుది తీర్పు వెలువరించింది. దీనితో ఈ వ్యవహారంతో ముడిపడి ఉన్న అన్ని న్యాయ ప్రక్రియలకు అధికారికంగా ముగింపు పడినట్లయింది. హిందూజా సోదరులతో పాటు స్వీడన్‌కు చెందిన ఆయుధ తయారీ సంస్థ 'ఏబీ బోఫోర్స్'పై ఉన్న అన్ని నేరపూరిత అభియోగాలను కొట్టేస్తూ 2005లో దిల్లీ హైకోర్టు చారిత్రాత్మక తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాలు చేస్తూ అడ్వకేట్ అజయ్ కే అగర్వాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించేందుకు జస్టిస్ జేబీ పార్డీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం పూర్తిగా నిరాకరించింది.

**"ఇక ఏ విచారణా లేదు"**

విచారణ సందర్భంగా, ..మిగతా 2లో



## నో క్వాలిటీ.. నో విటమిన్స్!

ఫార్చ్యూన్ ఆయిల్ వాడితే అంతే

నిర్ధారించిన ఎఫ్ఎస్ఎస్ఏఐ... భారీగా జరిమానా విధింపు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

ప్రముఖ 'ఫార్చ్యూన్' బ్రాండ్ వంటనూనెల తయారీ సంస్థ ఏడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్ లిమిటెడ్‌కు భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ జరిమానా విధించింది. గోవాలోని తాజ్ ఫోర్ట్ అగ్వాడా రిసార్ట్ అండ్ స్పాలో నిర్వహించిన తనిఖీల్లో సేకరించిన "ఫార్చ్యూన్ ఫ్రయోలా " శుద్ధి ..మిగతా 2లో

# చేనేతకు పూర్వ వైభవం

మొదటి పేజీ తరువాయి...

జీవన ప్రమాణాలు పెంచుతామన్నారు. చీరాల, వెంకటగిరి, ధర్మవరం, ఉప్పాడ, శ్రీకాకుళం, మంగళగిరి, పొందూరు, పెడన, నరసాపురం చేనేత ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. చేనేత వైభవాన్ని మళ్లీ తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

**ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం...**

సుమారు 1,27,000 మంది చేనేత మీద ఆధారపడ్డారని ముఖ్యమంత్రి వెల్లడించారు. చాలా వృత్తులను చూశానని.. చేనేత పైనే ఆధారపడిన ఏకైక వర్గం చేనేత కార్మికులన్నారు. మగ్గాన్నే నమ్ముకున్న ఏకైక వర్గం చేనేత అని అన్నారు. తాను రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత ఎక్కువ కన్సర్న్ చూపించిన వర్గం చేనేత అని.. ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా ఎప్పుడూ చేనేత కార్మికులు తెలుగుదేశం పార్టీకే ఓటు వేశారన్నారు. ఎన్నికలకు ముందు 200 రూపాయలు హ్యాండ్లూమ్‌కి, 500 యూనిట్లు పవర్‌లూమ్‌కి సబ్సిడీ ఇస్తానని చెప్పానని.. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామన్నారు.

**చేనేతలకు పెన్షన్ ఇచ్చిన తొలి ప్రభుత్వం మాదే...**

చేనేత కార్మికులు మగ్గం దగ్గర కూర్చొని అందులో వచ్చి కాటన్ అంతా కూడా కడుపులోకిపోయి అనారోగ్యం పాలవుతున్నారనే ఉద్దేశంతో 50 సంవత్సరాలకే పెన్షన్ ఇచ్చామని తెలిపారు. 50 ఏళ్లకే చేనేత కార్మికులకు పెన్షన్ ఇచ్చిన తొలి ప్రభుత్వం తమదే అని అన్నారు. 85 వేల మంది చేనేత కార్మికులకు పెన్షన్లు అందిస్తున్నామని.. పెన్షన్‌ను రూ.4 వేల నుంచి రూ.6 వేల వరకు పెంచామని తెలిపారు. చేనేత పెన్షన్ల కోసం ఏడాదికి రూ.420 కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. 109 చేనేత సహకార సంఘాలకు రూ.79 కోట్ల క్యాష్ క్రెడిట్ ఇస్తున్నామని, 10 చేనేత క్లస్టర్ల అభివృద్ధికి రూ.10 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. చేనేత మార్కెటింగ్‌కు ప్రత్యేక సహాయ



కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు ఏర్పాటు చేశామని, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్క్ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు.

**ఎన్డీఏ విజయానికి బీసీలే కారణం..**

45 ఏళ్లుగా టీడీపీకి బీసీలు వెన్నెముకగా నిలిచారని ముఖ్యమంత్రి అన్నారు. ఎన్డీఏ విజయానికి బీసీలే ప్రధాన కారణమన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణం చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని.. సూపర్ సిక్స్ హామీల అమలులో ప్రభుత్వం ముందుకెళ్తోందని వెల్లడించారు. ప్రజలకు ఇబ్బంది లేని పరిపాలన అందిస్తున్నామన్నారు. నేతన్న సేవలో కింద రూ.25 వేల ఆర్థిక సాయం, తల్లికి వందనం ద్వారా ఇద్దరు పిల్లలుంటే రూ.30 వేల లబ్ధి, మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేశామని అన్నారు. డీఎస్సీ ద్వారా 16 వేల ఉద్యోగాలకు తొలి సంతకంతో హామీ నెరవేర్చామని , 1.34 లక్షల మత్స్యకారులకు రూ.505 కోట్ల ఆర్థిక సాయం అందజేసినట్లు వెల్లడించారు. వడ్డర్లకు మైనింగ్ లీజులు, గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో 10% వాటా, 3 కిలోవాట్ల సోలార్ రూఫ్‌టాప్‌కు రూ.98 వేల సబ్సిడీ, కేంద్రం నుంచి రూ.78 వేలు, రాష్ట్రం నుంచి అదనంగా రూ.20 వేలు సబ్సిడీ అందజేస్తున్నట్లు తెలిపారు. వెనుకబడిన వర్గాల రుణం తీర్చుకోవడం ఎన్డీఏ ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.

**అభివృద్ధిపైనా శ్రద్ధ..**

చేపల వేట నిషేధ సమయంలో 1.34 లక్షల మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేల చొప్పున రూ.505 కోట్లు ఇచ్చామని చంద్రబాబు తెలిపారు. బీసీల కోసం రక్షణ చట్టం తీసుకువస్తున్నామని.. దీని ముసాయిదా సిద్ధమైందన్నారు. రాష్ట్రంలో అందరికీ రూ.2.5 లక్షల చొప్పున యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకువస్తున్నామని వెల్లడించారు. అభివృద్ధితో పాటు సంక్షేమం, సుపరిపాలనను అందించేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పేదలు భోజనానికి ఇబ్బందులు పడకుండా రూ.5 అన్నా క్యాంటీన్లో భోజనం అందిస్తున్నామన్నారు. కొందరు వ్యక్తులు దీనికీ అడ్డం పడి అన్నా క్యాంటీన్లను ఎత్తేశారని మండిపడ్డారు. సంక్షేమంతో పాటు అభివృద్ధిపైనా శ్రద్ధ పెడుతున్నామన్నారు. గత పాలనలో రోడ్లన్నీ గుంతలే అని.. రాష్ట్రాన్ని చూసి ఎగతాళి చేశారని చెప్పుకొచ్చారు. ఇప్పుడు రోడ్లకు మరమ్మత్తులు చేశామన్నారు. పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించామని.. రూ.12 లక్షల కోట్ల మేర పెట్టుబడులు ఇప్పటికే గ్రౌండ్ అయ్యాయని వివరించారు. యువతకు ఉద్యోగాలు వచ్చేలా చేస్తున్నామని, అభివృద్ధి-ఉపాధి కల్పించేలా పారిశ్రామికాభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. రోడ్లు, పోర్టులు, విమానాశ్రయాలు కూడా రాష్ట్రంలో నిర్మించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. పర్యాటకులను ఆకట్టుకునేలా సూర్యలంక, బాపట్ల, చీరాల సముద్ర తీర ప్రాంతాలను తీర్చిదిద్దుతున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# టీడీపీకి తగ్గాయి.. వైసీపీకి పెరిగాయి!

మొదటి పేజీ తరువాయి...

విరాళాల ద్వారా రూ.85 కోట్లు అందాయి. దీంతో ఒక్క ఏడాదిలోనే రూ.70 కోట్ల తగ్గుదల నమోదైంది. ఇక ఎంఐఎం 2024-25లో రూ.20 వేలకుపైగా ఒక్క విరాళాన్నీ ప్రకటించలేదు. 2023-24లో మాత్రం 16 విరాళాల ద్వారా రూ.9 లక్షలు ప్రకటించింది. ఏపీలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 2024-25లో 37 విరాళాల ద్వారా రూ.140 కోట్లు ప్రకటించింది. 2023-24లో కేవలం నాలుగు విరాళాల ద్వారా రూ.62.5 కోట్లు మాత్రమే వచ్చిన నేపథ్యంలో, ఈసారి రూ.77.5 కోట్ల పెరుగుదల నమోదైంది. ఆ పార్టీకి వచ్చిన నిధుల్లో అత్యధిక భాగం కార్పొరేట్ సంస్థలు, వ్యాపార వర్గాల నుంచే వచ్చింది. ఇతర వర్గాల నుంచి వచ్చిన విరాళాలు చాలా స్వల్పంగా ఉన్నాయి. ఇదిలాఉంటే.. 2024-25లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన అన్ని విరాళాలు బ్యాంక్ ట్రాన్స్‌ఫర్ ద్వారానే అందాయి. ప్రధాన ప్రాంతీయ పార్టీల్లో తమ మొత్తం విరాళాలను పూర్తిగా బ్యాంక్ ట్రాన్స్‌ఫర్ల ద్వారానే స్వీకరించిన ఏకైక పార్టీగా వైఎస్సార్‌సీపీ నిలిచింది. 2023-24లో ప్రాంతీయ పార్టీల్లో అత్యధిక విరాళాలు ప్రకటించిన టీడీపీ.. 2024-25లో విరాళాలు 17.1 శాతంకు తగ్గాయి. గత ఏడాది 172 విరాళాల ద్వారా రూ.100 కోట్లు అందుకోగా, ఈసారి 267 విరాళాల ద్వారా రూ.83 కోట్లు మాత్రమే వచ్చాయి. దీంతో రూ.17 కోట్ల తగ్గుదల నమోదైంది. అయితే రెండు ఆర్థిక సంవత్సరాలను కలిపి చూస్తే, టీడీపీకి కార్పొరేట్ సంస్థల నుంచి రూ.116 కోట్లు, వ్యక్తిగత దాతల నుంచి రూ.66.6 కోట్లు అందాయి. ఇక జనసేన పార్టీకి 2023-24లో విరాళాల ద్వారా రూ.36కోట్లు రాగా.. 2024-25లో రూ.25కోట్లు వచ్చాయని ఏడీఆర్ పేర్కొంది. దేశంలోని 40 ప్రాంతీయ పార్టీలకు 2024-25లో రూ.1,051.55 కోట్ల విరాళాలు వచ్చినట్లు ఏడీఆర్ సంస్థ పేర్కొంది. అయితే, ప్రాంతీయ పార్టీలకు సంబంధించి 2024-25లో రూ.20వేల కన్నా ఎక్కువ మొత్తంలో వచ్చిన విరాళాలను పరిశీలిస్తే.. 2024-25లో రూ.365.78 కోట్ల విరాళాలతో డీఎంకే మొదటిస్థానంలో నిలిచింది. తృణమూల్ కాంగ్రెస్ రూ.184.96 కోట్లతో రెండో స్థానంలో, రూ. 140 కోట్లతో వైసీపీ మూడో స్థానంలో, రూ.83కోట్లతో టీడీపీ నాలుగో స్థానంలో నిలిచింది. ఇక రూ.66 కోట్లతో అన్నాడీఎంకే ఐదో స్థానంలో నిలిచింది. 2024-25 నాటికి కేవలం నాలుగు విరాళాల ద్వారా బీఆర్ఎస్ పార్టీ కేవలం రూ. 15కోట్లను మాత్రమే స్వీకరించింది.

# ఉత్తరాంధ్రకు వర్షగండం

మొదటి పేజీ తరువాయి...



ఈదురుగాలులతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు విస్తారంగా కురిసే అవకాశముందని అధికారులు తెలిపారు. వాతావరణ పరిస్థితులు తీవ్రంగా మారే అవకాశం ఉన్నందున ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు. శనివారం రోజున ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం ప్రాంతాల్లో ఉధృత స్థాయిలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని స్పష్టం చేశారు. తీరం పొడవునా గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులు వీచే సూచనలు ఉన్నందున మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్లకూడదని స్పష్టమైన నిబంధనలు విధించారు. వీటికి తోడు అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, మార్కాపురంలతో పాటు రాయలసీమ ప్రాంత పరిధిలోని మొత్తం 16 జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. వర్షం పడే సమయంలో వజ్రపాతాలు, పిడుగులు పడే తీవ్ర ప్రమాదం ఉన్నందున ప్రజలు అనవసరంగా ఇళ్ల నుంచి బయటకు రాకూడదని అధికారులు విజ్ఞప్తి చేశారు. తుపాను గాలుల ధాటికి చెట్లు విరిగిపడటం, విద్యుత్ స్తంభాలు కూలడం లేదా ప్రచార హోర్డింగులు పడిపోయే ప్రమాదం ఉన్నందున వాటి కింద ఆశ్రయం పొందకూడదని స్పష్టం చేశారు. లోతట్టు, తీరప్రాంత ప్రజలు నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తూ, వాతావరణ శాఖ ఇచ్చే అధికారిక సమాచారాన్ని పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రఖర్ జైన్ కోరారు.

# సీబీఐ విచారణ జరపాల్సిందే

మొదటి పేజీ తరువాయి...

అవకతవకలు జరిగాయని వైసీపీ ఆందోళన వ్యక్తం చేస్తోంది. దీనికి మద్దతుగా నిరుద్యోగ జేఏసీ ప్రతినిధులు జగన్‌ను కలిశారు. ముఖ్యంగా డీఎస్సీ పరీక్షల నిర్వహణ తీరుపై ఫలితాల్లో నెలకొన్న అస్పష్టతపై వారు ఫిర్యాదు చేశారు. నిరుద్యోగుల విన్నపాన్ని సానుకూలంగా స్వీకరించిన జగన్, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వం ముందు వైఎస్ జగన్, వైఎస్సార్‌సీపీ కీలకమైన డిమాండ్‌లు ఉంచింది. డీఎస్సీలో జరిగిన అక్రమాలపై నిష్పాక్షికంగా సీబీఐ విచారణ జరిపించాలి. ఈ విఫల్యానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీలో భాగంగా నోటిఫికేషన్‌లో పదివేల పోస్టులు భర్తీ చేయాలి. పోలిస్ అభ్యర్థుల గరిష్ట వయోపరిమితిని 35ఏళ్లకు పెంచాలి. ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగులకు నెలకు 3000 రూపాయల భృతి ఇవ్వాలి. బకాయిపడిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అభ్యర్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి వైఎస్ఆర్‌సీపీ భారీ ఆందోళనలకు శ్రీకారం చుట్టింది. ఇవాళ రేపు(ఆగస్టు7,8) అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో పార్టీ శ్రేణులు రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నారు. ఆగస్టు 10న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో విద్యార్థులు, నిరుద్యోగ యువత, ప్రజా సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించనున్నారు. ఈ నెల 10 తర్వాత ప్రభుత్వం స్పందించకుంటే తదుపరి పోరాట కార్యాచరణ ప్రకటిస్తామని వైసీపీ నేతలు వెల్లడించారు. మరోవైపు గురువారం పలు ప్రాంతాల్లో జరిగిన నిరసనల్లో అధికార పార్టీ నేతలు తమపై దాడులు చేశారని వైసీపీ నేతలు ఆరోపించారు. ముఖ్యంగా విజయవాడలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆధ్వర్యంలో జరుగుతున్న దీక్షా శిబిరంపై దాడి చేశారని అన్నారు. టెంట్లు పీకడం, మహిళా కార్యకర్తలపై రాళ్లు, కోడిగడ్లు విసరడం వంటి ఘటనలను మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ తీవ్రంగా ఖండించారు. పోలీసుల సమక్షంలో దాడులు జరగడం, నిరసనకారులనే అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు.


# విడాకుల కేసు ఉపసంహారణ

మొదటి పేజీ తరువాయి...

ప్రారంభమైంది. సంగీత తన పిటిషన్‌లో విజయ్‌పై తీవ్రమైన ఆరోపణలు చేశారు. 2021లో విజయ్ ఒక మహిళా నటితో సంబంధం కలిగి ఉన్నట్టు తాను గుర్తించానని, దానిని ఆపమని కోరినప్పటికీ ఆయన పట్టించుకోలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. విజయ్ తనను సామాజిక, వృత్తిపరమైన కార్యక్రమాలకు దూరం పెట్టారని, అదే సమయంలో సదరు నటితో కలిసి బహిరంగంగా తిరుగుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమాల్లో విజయ్, ఆ నటి కలిసున్న ఫొటోలు వైరల్ కావడంతో తనను, తన ఇద్దరు పిల్లలను తీవ్ర అవమానానికి గురి చేసిందని ఆమె గతంలో వాదించారు. విజయ్ తన స్వేచ్ఛను హరించడమే కాకుండా, ఆర్థికపరమైన పరిమితులు కూడా విధించారని ఆమె తన పిటిషన్‌లో ఆరోపించారు.

**విచారణ సాగిందిలా**

ఈ ఏడాది ఫిబ్రవరిలో పిటిషన్ దాఖలు చేసినప్పటి నుంచి ఈ కేసు పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. గత నెలలో జరిగిన విచారణకు విజయ్ లేదా సంగీత ఇద్దరూ వ్యక్తిగతంగా హాజరుకాకపోవడంతో న్యాయమూర్తి ఆగస్టు 7కు కేసును వాయిదా వేశారు. అప్పటి వరకు ఇరు పక్షాల లాయర్లు మాత్రమే కోర్టుకు హాజరై, తమ క్లయింట్లు బిజీగా ఉండటం వల్ల రాలేకపోతున్నారని కోర్టుకు విన్నవించారు. విజయ్, సంగీతల వివాహం ఆగస్టు 25, 1999న చెన్నైలో సంప్రదాయ హిందూ పద్ధతిలో జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. విజయ్ సినిమాల నుంచి రాజకీయాల్లోకి ప్రవేశించి, ఈ ఏడాది మే నెలలో తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వేళ ఈ వైవాహిక వివాదం జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. సంగీత తన పిటిషన్‌లో మనోవర్తితోపాటు చెన్నైలోని నీలంగరైలో ఉన్న తమ నివాసంలోనే ఉండేందుకు అనుమతి కోరినప్పటికీ, ఇప్పుడు కేసును ఉపసంహరించుకోవడం ద్వారా వారు తిరిగి కలిసి ఉండే అవకాశం ఉందా అన్న చర్చ మొదలైంది. ముఖ్యమంత్రిగా విజయ్ రాజకీయ ప్రస్థానంలో ఈ నిర్ణయం ఆయన వ్యక్తిగత ప్రతిష్టను కొంత ఊరటనిచ్చే విషయమని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతానికి చెంగల్పట్టు కోర్టు ఈ వివాదాన్ని అధికారికంగా ముగించింది. భవిష్యత్‌లో ఈ దంపతులు తిరిగి కలిసి జీవిస్తారా లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది.



# బోఫోర్స్.. ఇక సుఖాంతం

మొదటి పేజీ తరువాయి...

ఈ కేసులో నిందితులుగా ఉన్న శ్రీచంద్ పీ హిందూజా, గోపీచంద్ పీ హిందూజాలు ఇప్పటికే మరణించినందున వారి పేర్లను పిటిషన్ నుంచి తొలగించడానికి మరింత సమయం కావాలని అగర్వాల్ కోర్టును కోరారు. అయితే, ఈ విషయంలో ఇకపై ఎలాంటి జాప్యానికి తావులేదని స్పష్టం చేసిన బెంచ్, ఆ విజ్ఞప్తిని తోసిపుచ్చింది. 2005లోనే ఢిల్లీ హైకోర్టు ఈ కేసును పూర్తిగా కొట్టేసిందని, ఆ తీర్పుపై గతంలో సీబీఐ వేసిన అప్పీల్‌ను కూడా అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించిందని ధర్మాసనం గుర్తుచేసింది. అటువంటప్పుడు ఈ విచారణను ఇంకా ఎందుకు కొనసాగించాలని సుప్రీంకోర్టు ప్రశ్నించింది.

**రూ.250 కోట్ల ప్రజాధనం వృథా!**

2005 మే 31న ఢిల్లీ హైకోర్టు హిందూజా సోదరులపై ఉన్న అన్ని అభియోగాలను కొట్టివేస్తూ సంచలన తీర్పునిచ్చింది. అంతేకాకుండా, ఈ కేసు దర్యాప్తు కోసం సీబీఐ దాదాపు రూ. 250 కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేయడాన్ని తీవ్రంగా తప్పుపట్టింది. ఆ తర్వాత, సుదీర్ఘంగా 4,522 రోజుల ఆలస్యం ముసుగులో సీబీఐ 2018 నవంబర్‌లో వేసిన అప్పీల్‌ను కూడా సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకోకుండా కొట్టివేసింది.

**అసలేమిటీ బోఫోర్స్ వివాదం?**

భారత ప్రభుత్వం, స్వీడిష్ ఆయుధ సంస్థ ఏబీ బోఫోర్స్ మధ్య 1986 మార్చి 24న రూ. 1,437 కోట్ల విలువైన 400 హోవిట్జర్ ఫిరంగుల కొనుగోలు ఒప్పందం కుదిరింది. అయితే, ఈ కాంట్రాక్ట్ దక్కించుకోవడానికి భారత రాజకీయ నాయకులకు, రక్షణ అధికారులకు అక్రమంగా లంచాలు ఇచ్చారని 1987లో స్వీడిష్ రేడియో బహిర్గతం చేసింది. ఈ ఆరోపణలు దేశ రాజకీయాలను తీవ్రంగా షేక్ చేశాయి. ఏళ్ల తరబడి సాగిన ఈ చట్టపరమైన పోరాటం, తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన తుది తీర్పుతో పూర్తిగా తుది ఘట్టానికి చేరుకుంది.

# వాళ్లను ఉపేక్షించవద్దు

**మెడికోలకు మెరుగైన వైద్యం అందిచాలి**

**సీఎం, డిప్యూటీ సీఎం ఆదేశాలు**

**రాజమండ్రిలో హిట్ అండ్ రన్ కేసు**

(రాజమహేంద్రవరం - జయజయహే)

రాజమహేంద్రవరంలో మద్యం మత్తులో కారు నడిపి ఇద్దరు మెడికల్ స్టూడెంట్స్ ను ఢీకొట్టిన ఘటనలో నిందితులైన సురవరపు దుష్యంత్, ఆంద్రూ విలియం జోసెఫ్‌లను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం న్యాయమూర్తి నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించారు. ఆగస్టు 3న ప్రసాద్ ఆదిత్యమాల్ గేటు వద్ద మద్యం మత్తులో ఉన్న నిందితులు కారును నిర్లక్ష్యంగా నడుపుతూ బైకుపై వెళ్తున్న మెడికల్ స్టూడెంట్స్ ప్రియాంక, ఉమేష్‌లను ఢీకొట్టి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ప్రమాదంలో ప్రియాంక తలకు తీవ్ర గాయం కాగా, ఆమెను మొదట స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో బుధవారం నాడు సికింద్రాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె వెంటిలేటర్‌పై ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. విజయవాడకు చెందిన మరో మెడికల్ స్టూడెంట్ ఉమేష్ స్వల్ప గాయాలతో కోలుకుంటున్నారు. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. యాక్సిడెంట్ చేసి దుర్మార్గంగా ప్రవర్తించిన నిందితులను అరెస్ట్ చేశామని సీఎం చంద్రబాబు అధికారులు తెలిపారు. ఎవరైనా తప్పు చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని , నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూడాలన్నారు. తీవ్రగాయాలపాలైన ప్రియాంక ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడూ పర్యవేక్షించాలని, బాధిత కుటుంబాలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు.

**డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విచారం..**

రాజమహేంద్రవరంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విచారం వ్యక్తం చేశారు. మద్యం మత్తులో కారు నడిపి ఇద్దరు మెడికల్ విద్యార్థులు తీవ్రంగా గాయపడటానికి కారణమైన ఈ ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రమాద తీవ్రతను పరిగణనలోకి తీసుకుని ఏలూరు రేంజ్ డీఐజీతో పవన్ కళ్యాణ్ మాట్లాడారు. ఈ ఘటనను ఎంతో సీరియస్‌గా తీసుకుని, మద్యం మత్తులో వాహనం నడిపి అమాయకుల ప్రాణాలతో చెలగాటమాడిన నిందితులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వైద్య విద్యార్థులు ప్రియాంక, ఉమేష్ ఆరోగ్య పరిస్థితిపై ఆయన ప్రత్యేకంగా ఆరా తీశారు. బాధితులకు తగిన చికిత్స అందించి, వారికి మెరుగైన వైద్యం అందేలా తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.

# నో క్వాలిటీ.. నో విటమిన్స్!

మొదటి పేజీ తరువాయి...

చేసిన పొద్దుతిరుగుడు నూనె నమూనా నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేదని నిర్ధారణ అయ్యింది. విటమిన్లు తగిన స్థాయిలో లేకపోవడంతో సదరు ఉత్పత్తులు నాణ్యతా లోపంతో కూడుకున్నవని పేర్కొంటూ ఆహార నియంత్రణ సంస్థ ఈ చర్యలు చేపట్టింది. ఆహార భద్రతా ప్రమాణాల నిబంధనలు 2018 ప్రకారం ప్రాథమిక లేబొరేటరీలో జరిపిన పరీక్షల్లో ఈ ఆయిల్‌లో విటమిన్-ఎ, విటమిన్-డి స్థాయిలు నిర్ణీత పరిమితి కంటే చాలా తక్కువగా ఉన్నట్లు తేలింది. దీనిపై కంపెనీ అప్పీల్ చేయడంతో, శాంపిల్‌ను రీ-టెస్టింగ్ కోసం రెఫరల్ ల్యాబ్‌కు పంపగా, అక్కడ కూడా విటమిన్-డి పరిమాణం చాలా తక్కువగా ఉన్నట్లు ఆధారాలతో సహా ధృవీకరించబడింది. దీని ఆధారంగా గోవా అడ్జుడికేటింగ్ ఆఫీసర్ సదరు సంస్థపై జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ మధ్యకాలంలో ఆహార భద్రతా నిబంధనలను ఉల్లంఘించే కంపెనీలు, ఈ-కామర్స్ వేదికలపై ఎఫ్ఎస్ఎస్ఏఐ కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే ఎనర్జీ డ్రింక్స్, ఆల్కహాల్ పానీయాల తయారీదారుల పైనా దృష్టి సారించింది. అహ్మదాబాద్ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న ఏడబ్ల్యూఎల్ సంస్థకు చెందిన మంగళూరు యూనిట్ తయారు చేసిన ఈ ఉత్పత్తుల నాణ్యతా రాహిత్యంపై చట్టపరమైన చర్యలు ప్రారంభమయ్యాయి. అయితే విధించిన జరిమానా మొత్తం ఎంతనేది ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారికంగా వెల్లడించలేదు.

# దిశా చట్టం రద్దు...మహిళల భద్రతపై కూటమి దాడి...!

**- మహిళల చట్టాన్ని రద్దు చేయడం దుర్మార్గమైన నిర్ణయం**

**వైసీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరుదు కళ్యాణి**

**విశాఖపట్నం, ఆగస్టు 7, జయ జయహే**




దిశా చట్టాన్ని రద్దు చేయడమంటే మహిళల భద్రతను గాలికి వదిలేయడమేనని వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు ,శాసన మండలి సభ్యురాలు వరుదు కళ్యాణి అన్నారు. పార్టీ ఆదేశాల మేరకు వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం మహిళా విభాగం నగర అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి ఆధ్వర్యంలో విశాఖపట్నం జీవీఎంసీ జంక్షన్ మహాత్మా గాంధీ విగ్రహం వద్ద చంద్రబాబు మరో వెన్నుపోటు దిశ చట్టం రద్దు... మహిళలకు ముప్పు అనే నిరసన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ...ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో దిశా చట్టాన్ని రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించారు. మహిళల భద్రత, రక్షణ కోసం మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధితో రూపొందించిన దిశా చట్టాన్ని రద్దు చేయడం మహిళల భద్రతను గాలికి వదిలేయడమేనని ఆమె మండిపడ్డారు. రాష్ట్రంలో సుమారు 1.50 కోట్లకు పైగా మహిళలు దిశా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారని, వేలాది మంది మహిళలు ఆ యాప్ ద్వారా పోలీసుల సహాయం పొందిన సందర్భాలు ఉన్నాయని పేర్కొన్నారు. మహిళా భద్రతకు భంగం కలిగించే నిర్ణయాన్ని అంగీకరించిన హోంమంత్రి అనిత తన పదవికి నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నగర అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి మాట్లాడుతూ..మహిళల గౌరవం గురించి మాట్లాడుతున్న తెలుగుదేశం పార్టీ నాయకులు, మహిళలను గౌరవించడం అంటే కేవలం రాజకీయ వేదికలపై మాటలు చెప్పడం మాత్రమే కాదని, ఆ గౌరవాన్ని ఆచరణలో కూడా చూపించాల్సిన అవసరం ఉ ందన్నారు. ఎన్నికల సమయంలో మహిళలకు అండగా ఉ ంటామని, ఆడబిడ్డలకు రక్షణ కల్పిస్తామని హామీలు ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల రక్షణకు కీలకమైన 'దిశ' వ్యవస్థను రద్దు చేయడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మహిళా లోకాన్ని ఏకం చేసి ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాలు చేపడతామని, ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని పేడాడ రమణికుమారి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ అధ్యక్షులు బొల్లవరపు జాన్ వెస్లీ మహిళ నాయకులు , మహిళ సీనియర్ నాయకులు, మహిళ కార్యకర్తలు పాల్గొన్నారు.



## అభివృద్ధంటే.. విశాఖ ఎయిర్‌పోర్టు మూసేయడమా..!

**- అంతర్జాతీయ నగరంగా చేస్తామని బస్టాండ్‌కే పరిమితం చేస్తారా**

**- ఎయిర్‌పోర్టు కొనసాగిస్తామనకపోతే బాబుకు ప్రజా నిరసనే**

**- విష్ణుకుమార్‌రాజుకు విజ్ఞప్తి చేసిన తెలుగు శక్తి అధ్యక్షులు బీవీ రామ్**

**విశాఖపట్నం, ఆగస్టు 7, జయ జయహే**

విశాఖను అంతర్జాతీయ నగరంగా చేస్తామని ఎన్నికలప్పుడు హామీలిచ్చిన మోడీ, చంద్రబాబులు ఉన్న ఎయిర్‌పోర్టును తీసేసి బస్టాండ్‌కే విశాఖను పరిమితం చేయడంపై తెలుగు శక్తి అధ్యక్షులు బీవీ రామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం సీతమ్మధారలోని బీజేపీ ఉత్తర ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజుకి ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు విశాఖను అంతర్జాతీయ స్థాయి నగరంగా అభివృద్ధి చేస్తామని, తమది డబుల్ ఇంజన్ సర్కారంటూ ప్రగల్భాలు పలికిన కూటమి నాయకులు, ఉన్న ఎయిర్‌పోర్టును మూసి వేయడానికి సిద్ధపడటం చాలా దారుణమన్నారు. 80 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన విశాఖ ఎయిర్‌పోర్టు, భోగాపురం విమానాశ్రయం ప్రారంభమైన వెంటనే మూసి వేయాలని చూడటం ఏ రకమైన అభివృద్ధి అని ప్రశ్నించారు. విశాఖను అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చేస్తామని, ఐటి హబ్‌గా మారుస్తామని మోడీ, చంద్రబాబులు ప్రజలకు హామీ ఇచ్చి, ఎయిర్ పోర్టు లేని విశాఖగా తయారు చేయడానికి పూనుకోవడం ప్రజా వంచనేనన్నారు. అభివృద్ధంటే.. ఉన్న ఎయిర్‌పోర్టు మూసేసి వేలాదిమంది ఉపాధిని, పర్యాటక, రవాణా, సేవా రంగాలను దెబ్బ తీయడమా.. ప్రజలపై నాలుగు రెట్లు ప్రయాణ సమయం పెంచడమా.. రవాణా, భోగాపురం ఎయిర్‌పోర్టు సర్వీసులు పేరిట పదిరెట్లు అదనపు ఛార్జీల భారం వేయడమా.. ప్రభుత్వరంగ ఎయిర్‌పోర్టును మూసివేసి ప్రైవేటు జీఎంఆర్ సంస్థకు సేవలు చేయడమా.. విశాఖ జిల్లా ప్రజానీకానికి లేని కష్టాలు తీసుకువచ్చే ఈ విధ్వంసాన్ని ఆపాలని... విశాఖపట్నం ఎయిర్‌పోర్టును డొమెస్టిక్ ఎయిర్‌పోర్టుగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ దీనిపై సీఎం చంద్రబాబు తక్షణమే ప్రకటన చేయాలని, లేనిపక్షంలో ఆయన విశాఖ ఎప్పుడు వచ్చినా ప్రజా నిరసన ఎదుర్కోక తప్పదని తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ హెచ్చరించారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో డాక్టర్ పప్పూరు నికుంజ్, బొల్లినేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థి వరహాల బాబుకు అండగా నిలిచిన హోం మంత్రి

**మరోసారి మానవత్వాన్ని చాటిన మంత్రి**

**విద్యార్థులను అభినందించిన మంత్రి**

**నక్కపల్లి, ఆగస్టు 07:- (జయ జయహే)**

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నక్కపల్లి డిగ్రీ కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థి వరహాల బాబుకు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అండగా నిలిచారు. విద్యార్థి వైద్య ఖర్చుల బాధ్యతను స్వీకరించి మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు.జూలై 29న జరిగిన రోడ్డు ప్రమాదంలో వరహాల బాబు తీవ్రంగా గాయపడగా, ప్రస్తుతం విశాఖపట్నంలోని మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. స్నేహితుడి వైద్యం కోసం తోటి విద్యార్థులు విరాళాలు సేకరిస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేపట్టారు. ఇన్‌స్టాగ్రామ్‌లో వరహాల బాబు వీడియోను చూసిన హోం మంత్రి అనిత వెంటనే స్పందించారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై మెడికవర్ ఆసుపత్రి వైద్యులతో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి, వరహాల బాబుకు అత్యుత్తమ వైద్యం అందించాలని ఆదేశించారు. అలాగే విద్యార్థి వైద్యానికి అయ్యే ఖర్చుల బాధ్యతను స్వీకరించారు. ఈ సందర్భంగా నక్కపల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో హోం మంత్రి అనితను కలిసిన వరహాలబాబు సహ విద్యార్థులు, తమ స్నేహితుడికి అండగా నిలిచినందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులతో మాట్లాడిన హోం మంత్రి అనిత, తమ స్నేహితుడి ప్రాణాలను కాపాడేందుకు ఐక్యంగా ముందుకొచ్చి చేసిన ప్రయత్నం అభినందనీయమని కొనియాడారు. “మనిషికి మనిషే సాయం... ఇదే నిజమైన మానవత్వం” అని పేర్కొన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించడం, జాగ్రత్తగా వాహనం నడపడం ద్వారా ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని విద్యార్థులకు హోం మంత్రి సూచించారు.




## మహిళల భద్రతే లక్ష్యం.. అవగాహనే అసలైన ఆయుధం

**ధవళేశ్వరం: జయ జయహే : ఆగస్టు 7**

తూర్పుగోదావరి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు, సౌత్ జోన్ డీఎస్పీ శివప్రియ ఆధ్వర్యంలో, ధవళేశ్వరం సిఐ గణేష్ పర్యవేక్షణలో శుక్రవారం ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎపిఐఐసి ఇండస్ట్రియల్ కాలనీలో శక్తి టీమ్ ఆధ్వర్యంలో మహిళల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది మహిళలు పాల్గొన్నారు.మహిళలు, చిన్నారుల భద్రత, శక్తి యాప్ వినియోగం, సైబర్ నేరాలు, ఫేక్ కాల్స్, ఓటిపి , ఆధార్ మోసాలు, ఏటీఎం మోసాలు, సోషల్ మీడియా దుర్వినియోగం, ఫోటో మార్ఫింగ్, డ్రగ్స్ దుష్పరిణామాలు, సెల్ఫ్ డిఫెన్స్, ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలు, రోడ్డు భద్రత, మైనర్ డ్రైవింగ్, పోక్సో చట్టం, కుటుంబ కలహాలు, వన్ స్టాప్ సెంటర్ సేవలు, అత్యవసర సహాయ నంబర్లు 100/112, 1098, 1930 తదితర అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సిఐ గణేష్ మాట్లాడుతూ, “మహిళల భద్రతలో అవగాహనే మొదటి రక్షణ కవచం. అపరిచితులను నమ్మవద్దు.. వ్యక్తిగత వివరాలు, ఓటిపి లు ఎవరికీ చెప్పవద్దు. సోషల్ మీడియాలో అప్రమత్తంగా ఉ ండాలి. చిన్న అనుమానం వచ్చినా వెంటనే పోలీసులను ఆశ్రయిస్తే నేరాలను ముందుగానే అడ్డుకోవచ్చు. ప్రతి మహిళ శక్తి యాప్‌ను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకుని అత్యవసర పరిస్థితుల్లో వినియోగించుకోవాలి. పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటుంది” అని పేర్కొన్నారు. కార్యక్రమంలో శక్తి టీమ్ పోలీసులు, మహిళా పోలీసులు, ఎపిఐఐసి ఇండస్ట్రియల్ కాలనీకి చెందిన మహిళలు, స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.



## మెగా డీఎస్సీ అక్రమాలపై విచారణ చేపట్టాలి.

**రాష్ట్ర వైసిపిమేధావుల సంఘ ఐక్యవేదిక కార్యదర్శి పూతలపట్టు జగదీశ్వర్ రెడ్డి.**

**పూతలపట్టు, ఆగస్టు 7,జయ జయహే.**

పూతలపట్టు నియోజకవర్గం లో వైసీపీ పార్టీ ఎదురులేని శక్తిగా ఎదుగుతుందని రాష్ట్ర వైసీపీ మేధావుల సంఘ ఐక్యవేదిక కార్యదర్శి పూతలపట్టు జగదీశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. మెగా డీఎస్సీ అక్రమాలపై రిలే నిరాహర దీక్ష శుక్రవారం యాదమరి మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్బంగా జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ డీఎస్సీ అక్రమాలకు నిరసనగా వైసిపి పార్టీ చేపట్టిన ఏపీ- జన్ -జెడ్ , రిలే నిరాహార దీక్షకు మంచి స్పందన లభించిందన్నారు. పూతలపట్టు నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష యాదవరి మండల కేంద్రంలో జరిగిందన్నారు. అందులో భాగంగా పూతలపట్టునుండి వైసిపి పార్టీ కార్యకర్తలు నాయకులు అభిమానులు పార్టీ శ్రేణులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆయన తెలియజేశారు. అనంతరం తన అభిమానంతో కలిసి యాదగిరి మండల కేంద్రంలో జరుగుతున్న రిలయ దినోత్సవ ఆయన పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కొణతాల

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి మండలం మార్టూరు గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను మాజీ మంత్రి కొనతాల రామకృష్ణ శుక్రవారం పరిశీలించడం జరిగింది అభివృద్ధి పనుల్లో భాగంగా డిఎంఎఫ్ నిధులు సుమారు నాలుగు కోట్ల రూపాయలతో పంచాయితీ నిధులు 70 లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు 16.5 లక్షలు రూపాయలతో గ్రామంలో సిసి రోడ్లు మరియు బిటి రోడ్లు చెరువు నిర్మాణ పనులు చేసిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఎండోమెంట్ నుంచి సుమారు 1. 35 కోట్లు వ్యయంతో నిర్మిస్తున్న శివాలయ అభివృద్ధి వీటిని నిర్మాణ పనులకు ఆమోదం లభించినట్లు ఆయన తెలిపారు త్వరలో ప్రారంభం కానున్న శివాలయం నిర్మాణ పనులకు ముందు స్వామి దర్శించుకుని ఆలయ ప్రాంగణానికి మరియు పరిసర ప్రాంతాలను ఆయన పరిశీలించడం జరిగింది అనంతరం సంబంధిత అధికారులకు కాంట్రాక్టులకు వీలైన అంత త్వరగా పనులు ప్రారంభించే నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడడానికి వీలులేదని ఈ సందర్భంగా అయినా అధికారులు కు సూచించడం జరిగింది. అక్కడే సమీపంలో ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన ఆయన కేంద్రంలోని వసతులు నిర్వహణపై ఆరా తీయడం జరిగింది అలాగే చిన్నారులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమల తో పాటు వారికి అందుతున్న పోషక ఆహారం గురించి సంబంధిత సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు అనంతరం చిన్నారాలతో ఆప్యాయంగా మమేకమై వారితో కొంతసేపు సరదాగా గడిపారు పిల్లలకు నాణ్యమైన ఆహారం మెరుగైన సంరక్షణ అందేలా నిరంతరం చూస్తూ ఉండాలని సంబంధిత అధికారులకు సూచించారు ఈ కార్యక్రమంలో



## దళిత కాలనీల్లో మౌళిక వసతులు కల్పించాలి

**చోడవరం ఆగస్టు 7 జయ జయహే**

చోడవరం లో గల ఐ టి ఐ, రెల్లి కాలనీలో డ్రైనేజీ, రోడ్లు, సామాజిక భవనం వంటి మౌలిక సదుపాయాల కల్పనలో చాలా వివక్ష కొనసాగుతోందని ప్రభుత్వం వెంటనే మౌళిక వసతులు కల్పనకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సామాజిక సమస్యలపై సామాజిక శంఖారావం కార్యక్రమం లో భాగంగా కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కె వి పి ఎస్), సీఐటియు, రైతు సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని దళిత వాడల్లో సమస్యలపై సర్వే చేస్తున్నామని దీనిలో భాగంగా శుక్రవారం చోడవరం మండలం కేంద్రంలో ఐ టి ఐ రెల్లి కాలనీ సర్వే చేస్తే కాలనీ లో సర్వే నిర్వహించమన్నారు. ఈ కాలనీలో అభివృద్ధి ఆమడ దూరంలో ఉన్నదని సి ఐ టి యు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ వి నాయుడు లు అన్నారు. కాలనీ 1990లో నిర్మించారని నాటినుండి నేటి వరకు ఇతర ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని కాలనీ వాసులు తెలియజేశారన్నారు. ఊరంతా ఊడ్చి శుభ్రం చేస్తున్న మేము మా నివాస ప్రాంతం మాత్రం కనీస వసతులైన రోడ్లు, కాలువలు లేక మురికి వాడలుగానే ఉన్నాయన్నారు. గత 13 ఏళ్లుగా సామాజిక భవనం లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ సమస్యల పరిష్కారానికై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పొట్నూరు అప్పారావు, తుపాకుల అర్జున్, వరప్రసాద్, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మెడికో ప్రియాంకకు న్యాయం చేయాలి: మార్గాని భరత్

**రాజమహేంద్రవరం: జయ జయహే : ఆగస్టు7:**




జిఎస్ఎల్ కళాశాల మెడికో ప్రియాంక ప్రమాద ఘటనలో పోలీసుల విచారణ తీరుపై అనుమానాలు ఉన్నాయని, బాధితురాలికి న్యాయం జరిగే వరకు వైసిపి అండగా నిలుస్తుందని మాజీ ఎంపీ, వైసిపి జాతీయ అధికార ప్రతినిధి, సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి మార్గాని భరత్ రామ్ అన్నారు. శుక్రవారం విఎల్‌పురంలోని వైసిపి నగర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఘటన జరిగి మూడు రోజులు గడిచినా నిందితులపై తక్షణ చర్యలు తీసుకోకపోవడం, కేసు నమోదు ఆలస్యం కావడం పలు అనుమానాలకు తావిస్తోందని ఆరోపించారు. సంబంధిత ఎస్‌హెచ్ఓ పాత్రపై కూడా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నగరంలో వరుస హత్యలు, బ్లేడ్ దాడులు, గంజాయి ముఠాల ఆగడాలు పెరుగుతున్నా ప్రభుత్వం, పోలీసులు సమర్థంగా స్పందించడం లేదని విమర్శించారు. ఈ నెల 8న మోరంపూడి జంక్షన్ ఫ్లైఓవర్ వద్ద ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, డీఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణ, మోరంపూడి సర్వీస్ రోడ్ల నిర్మాణం తదితర డిమాండ్లతో ఒక రోజు నిరాహార దీక్ష నిర్వహిస్తామని ప్రకటించారు.కార్యక్రమంలో వైసిపి నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



## అస్సాం వరదల సమస్యకు శాశ్వత జల నిర్వహణే పరిష్కారం

(హెచ్.ప్రతాప్)

భారతదేశంలో ప్రతి ఏడాది నైరుతి రుతుపవనాల రాకతో వరదలు సంభవించడం సహజ ప్రక్రియే అయినప్పటికీ, అస్సాంలో అవి ప్రకృతి వైపరీత్యాన్ని దాటి సామాజిక--ఆర్థిక సవాలుగా మారుతున్నాయి. ఈ ఏడాది కూడా వరదలు తీవ్ర ప్రభావాన్ని చూపాయి. ఇప్పటికే 95 మంది ప్రాణాలు కోల్పోగా, 14 జిల్లాల్లోని 563 గ్రామాలకు చెందిన 1.6 లక్షలకుపైగా ప్రజలు ప్రభావితమయ్యారు. ఏడు చోట్ల కరకట్టలు తెగిపోగా, దాదాపు 17 వేల హెక్టార్ల వ్యవసాయ భూమి నీట మునిగింది. సహాయక శిబిరాలు, అత్యవసర నిధులు, పునరావాస చర్యలు కొనసాగుతున్నాయి. అయితే ప్రతి సంవత్సరం పునరావృతమవుతున్న ఈ పరిస్థితి, తక్షణ సహాయక చర్యలతో పాటు దీర్ఘకాలిక వరద నిర్వహణ వ్యూహం ఎంత అవసరమో స్పష్టంగా తెలియజేస్తోంది.

అస్సాం వరదల చరిత్ర కొత్తది కాదు. 1950లో సంభవించిన మహా భూకంపం అనంతరం బ్రహ్మపుత్ర నది పరీవాహక ప్రాంత భౌగోళిక స్వరూపం గణనీయంగా మారింది. నదిలో మట్టి నిక్షేపాలు భారీగా పేరుకుపోవడంతో వరదల తీవ్రత క్రమంగా పెరిగింది. 1998, 2004, 2012, 2020, 2022 సంవత్సరాల్లో సంభవించిన వరదలు లక్షలాది మందిని నిరాశ్రయులను చేశాయి. ముఖ్యంగా 2022లో అస్సాంలోని 35 జిల్లాల్లో 32 జిల్లాలు వరదల బారిన పడి, సుమారు 30 లక్షల మంది ప్రజలు ప్రభావితమయ్యారు. వందలాది గ్రామాలు నీట మునిగాయి. ప్రపంచ ప్రఖ్యాత కాజిరంగా జాతీయ ఉద్యానవనం కూడా తీవ్రంగా దెబ్బతిని, అనేక వన్యప్రాణులు ప్రాణాలు కోల్పోయాయి. గత ఏడాది కూడా 6.3 లక్షల మంది ప్రజలు వరదల ప్రభావాన్ని ఎదుర్కొన్నారు. ప్రతి ఏడాది దాదాపు ఒకే విధమైన పరిస్థితులు పునరావృతం కావడం శాశ్వత పరిష్కారాల అవసరాన్ని సూచిస్తోంది.

అస్సాం భౌగోళిక స్వరూపమే వరదలకు ప్రధాన కారణాల్లో ఒకటి. ప్రపంచంలో అత్యధిక మట్టి నిక్షేపాలను మోసుకువచ్చే నదుల్లో బ్రహ్మపుత్ర ఒకటి. హిమాలయ ప్రాంతాల నుంచి వచ్చే అపారమైన సిల్ట్ నదీగర్భంలో పేరుకుపోవడంతో నీటి ప్రవాహ సామర్థ్యం తగ్గుతోంది. మరోవైపు అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్ పర్వత ప్రాంతాల్లో కురిసే భారీ వర్షాల కారణంగా బ్రహ్మపుత్రకు కలిసే యాభైకి పైగా ఉపనదులు ఒక్కసారిగా ఉప్పొంగి, గంటల వ్యవధిలోనే వరదలను తీవ్రతరం చేస్తున్నాయి. వాతావరణ మార్పుల ప్రభావంతో అత్యల్ప సమయంలో అత్యధిక వర్షపాతం నమోదవుతున్న ఘటనలు పెరగడం కూడా ఈ పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తోంది.

ఇప్పటివరకు అస్సాంలో వరద నియంత్రణకు ప్రధానంగా సుమారు 4,800 కిలోమీటర్ల కరకట్టల వ్యవస్థపై ఆధారపడుతున్నారు. గత ఆరు దశాబ్దాల్లో ఇందుకోసం వేల కోట్ల రూపాయలు వెచ్చించినప్పటికీ, కాలక్రమేణా అనేక కరకట్టలు మరమ్మతులకు అవసరమైన స్థితికి చేరుకున్నాయి. ప్రతి ఏడాది వరదల అనంతరం మరమ్మతులు చేయడం కంటే, దీర్ఘకాలిక వరద నిర్వహణ దృష్టితో సమగ్ర నదీ పరీవాహక ప్రణాళికలు రూపొందించడం మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. కేవలం కరకట్టల నిర్మాణం వరద సమస్యకు సంపూర్ణ పరిష్కారం కాదని ప్రపంచ అనుభవం స్పష్టం చేస్తోంది.



ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు ఇప్పుడు రివర్ బేసిన్ మేనేజ్‌మెంట్ విధానాన్ని అనుసరిస్తున్నాయి. నెదర్లాండ్స్ "రూమ్ ఫర్ ది రివర్" కార్యక్రమం ద్వారా నదులకు సహజ ప్రవాహ మార్గాలను పునరుద్ధరించింది. జపాన్ వరద నీటి నిల్వ సొరంగాలు, భూగర్భ జలాశయాలు, అత్యాధునిక హెచ్చరిక వ్యవస్థలతో వరద నష్టాన్ని గణనీయంగా తగ్గించింది. బంగ్లాదేశ్ వరదలతో సహజీవనం చేసే విధంగా ఎత్తైన ఆశ్రయ కేంద్రాలు, సమగ్ర ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను అభివృద్ధి చేసింది. ప్రకృతికి అనుగుణంగా నదీ నిర్వహణ చేపట్టినప్పుడు వరదల ప్రభావాన్ని తగ్గించవచ్చని ఈ దేశాల అనుభవం తెలియజేస్తోంది.

భారతదేశంలో కూడా ఈ దిశగా కొన్ని సానుకూల చర్యలు ప్రారంభమయ్యాయి. అస్సాంలో 24 చిత్తడి నేలల (వెట్‌ల్యాండ్స్) పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల వందల కోట్ల రూపాయల ప్రాజెక్టును ఆమోదించింది. ప్రకృతి సిద్ధమైన వరద నిరోధక వ్యవస్థలైన చిత్తడి నేలలు, వరద మైదానాల పునరుద్ధరణ ద్వారా అదనపు వరద నీటిని సహజంగా నిల్వ చేసే అవకాశాలు పెరుగుతాయి. అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు కూడా సమగ్ర నదీ పరీవాహక నిర్వహణకు ఆర్థిక సహకారం అందిస్తున్నాయి. ఈ కార్యక్రమాలను దీర్ఘకాలిక విధానంగా విస్తరించడం ద్వారా మరింత స్థిరమైన ఫలితాలు సాధించవచ్చు.

భవిష్యత్తులో అస్సాం కోసం ఒక ఏకీకృత బ్రహ్మపుత్ర పరీవాహక నిర్వహణ అథారిటీ ఏర్పాటు చేయడం, వరద నియంత్రణ, సాగునీరు, చిత్తడి నేలల సంరక్షణ, పట్టణ డ్రైనేజీ, నదీ కోత నివారణ, భూవినియోగ ప్రణాళికలను ఒకే వేదికపై సమన్వయం చేయడం ఉపయోగకరంగా ఉంటుంది. వరద మైదానాల్లో నిర్మాణాలను శాస్త్రీయ ప్రమాణాల ప్రకారం నియంత్రించడం, ఉపగ్రహ ఆధారిత రియల్‌టైమ్ వరద పర్యవేక్షణ, కృత్రిమ మేధ ఆధారిత ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, చైనా వంటి ఎగువ పరీవాహక దేశాలతో జలవిజ్ఞాన సమాచార మార్పిడిని మరింత బలోపేతం చేయడం కూడా సమగ్ర వరద నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా బ్రహ్మపుత్ర నదితో తరతరాలుగా జీవిస్తున్న నదీ ద్వీపాల (చార్ ప్రాంతాల) ప్రజల అనుభవాన్ని ప్రణాళికల్లో భాగం చేయడం ద్వారా స్థానిక అవసరాలకు అనుగుణమైన పరిష్కారాలు రూపొందించవచ్చు.

అస్సాం వరదలు కేవలం ప్రకృతి వైపరీత్యం మాత్రమే కాదు; ప్రకృతి, శాస్త్రం, ప్రణాళిక, ప్రజల భాగస్వామ్యం సమన్వయంతో నిర్వహించాల్సిన దీర్ఘకాలిక జలవనరుల సవాలు. సహాయక చర్యలు అత్యవసరమైనవే అయినప్పటికీ, వాటితో పాటు నదీ పరీవాహక నిర్వహణ, చిత్తడి నేలల సంరక్షణ, శాస్త్రీయ భూవినియోగ ప్రణాళిక, ఆధునిక సాంకేతికత ఆధారిత హెచ్చరిక వ్యవస్థలు, వాతావరణ మార్పులకు అనుగుణమైన విధానాలు సమగ్రంగా అమలైనప్పుడే అస్సాం ప్రతి ఏడాది పునరావృతమవుతున్న వరదల చక్రం నుంచి స్థిరమైన ఉపశమనం పొందగలదు.

# దీవెనలు మాత్రమే ప్రధానము బహుమతులు అప్రధానము

శ్రావణ పౌర్ణమి విశిష్టత

శ్రావణ పౌర్ణమిని "రాఖీ పౌర్ణమి", "జంధ్యాల పూర్ణిమ", "హయగ్రీవ జయంతి" అని కూడా అంటారు.

1.రాఖీ పౌర్ణమి-ప్రధాన రక్షా కథ

దేవతలు - రాక్షసులు

ఒకసారి రాక్షసులు దేవతలపై యుద్ధానికి వచ్చారు. దేవతలు ఓడిపోతున్నారు.

ఇంద్రుడు భయపడి గురువు బృహస్పతి దగ్గరికి వెళ్ళాడు.

బృహస్పతి ఇంద్రుని భార్య శచీదేవి కి ఒక మంత్రము చదివి రక్షా సూత్రం ఇచ్చాడు.

"దీన్ని నీ భర్త కుడి చేతికి కట్టు" అన్నాడు.

శ్రావణ పౌర్ణమి రోజు

శచీదేవి ఇంద్రుడికి రక్ష కట్టింది.

ఆ రక్షతో ఇంద్రుడు రాక్షసులను ఓడించాడు. అప్పటి నుండి రక్షాబంధన్ మొదలైంది.

మరొక కథ

కృష్ణుడు ఒ ద్రౌపది

మహాభారతంలో కృష్ణుడి వేలికి గాయమై రక్తం వచ్చింది.

ద్రౌపది వెంటనే తన చీర కొంగు చింపి కృష్ణుడి చేతికి కట్టింది.

కృష్ణుడు సంతోషించి "నువ్వు నాకు చెల్లివి. నీ రక్షకు నేనున్నాను" అన్నాడు.

తర్వాత వస్త్రాపహరణ సమయంలో కృష్ణుడు ద్రౌపదిని కాపాడు. ఇక్కడ నుండి మొదలైంది అసలైన సోదర సోదరీ భావన రక్ష. ఇదే మన రక్షాబంధనానికి ప్రత్యేక. మైన కథ.

2. శ్రీ హయగ్రీవ జయంతి

శ్రీ హయగ్రీవుడు శ్రీమన్నారాయణ అవతారం గుర్రం ముఖంతో మనిషి శరీరంతో ఉంటాడు.

విద్యకు దేవుడు అని పిలుస్తారు. శ్రావణ పౌర్ణమి రోజున శ్రీ హయగ్రీవ జయంతి.

3. లిజంధ్యాల పూర్ణిమ

ఈ రోజు బ్రాహ్మణులు కొత్త యజ్ఞోపవీతం / జంధ్యం మార్చుకుంటారు.

అందుకే "జంధ్యాల పూర్ణిమ" అంటారు. ఈరోజు బ్రాహ్మణులు ఇతర ద్విజులు కొత్త యజ్ఞోపవీతమును ధరిస్తారు. వేదాలు లేకుండా యజ్ఞాలు సంస్కారాలు ఆగిపోయాయి బ్రహ్మ, ఋషులు, విష్ణువును ప్రార్థించారు. విష్ణు హయగ్రీవ అవతారం ఎత్తి వేదాలను తిరిగి తెస్తాడు. ఆ సమయంలో కొత్త జంధ్యాలు వేసుకొని వేద పారాయణ ప్రారంభిస్తారు ఇదే ఉపాకర్మ.

ఉపకర్మ అనగా

ఉప=దగ్గర

అకర్మ = ప్రారంభం అంటే వేదాధ్యయనం ప్రారంభించడం



**శ్రావణ పౌర్ణమి రోజు ఏం చేస్తారు?**

అక్క-చెల్లెలు

తెల్లవార్జామున అభ్యంగన స్నానం చేసి రక్షా బంధనము కట్టడానికి ముందుగా సోదరుడు ని తూర్పు ముఖంగా కుర్చీ లో కూర్చోబెట్టి నుదుటన తిలుక ధారణ కుంకుమ తో చేసి కుడి చేతి మణికట్టుకి రక్షాబంధనం కట్టి దీవించమని అడిగి పాదాలకు నమస్కారం చేసి సోదరుడికి హారతిచ్చి ఏదైనా మిఠాయి తినిపించి సోదరుడు యొక్క దీవెనలు తీసుకోవాలి. ఇద్దరు సోదర భావంతో ఆనంద అనుభూతిని పొందాలి.

**భారతీయ సనాతన సంప్రదాయం:**

భారతదేశంలో సోదర సోదరీమణి భావం పెంపొందించుకొని ప్రస్తుత సమాజంలో జరుగుతున్న అధర్మమైన ఆకృత్యాలు ఇక పైన జరగకుండా ఉండేలా నడుచుకుని ఈ రక్షాబంధనం రక్షగా నిలిచి ఎటువంటి దాడులు మహిళలు పై సమాజంలో జరగకూడదు అనే సోదర భావంతో ప్రతి వ్యక్తి నడుచుకోవాలని, అన్నయ్యగా తమ్ముడిగా అక్క చెల్లెళ్లకు రక్షణ ఇవ్వాలని స్త్రీ పురుషులు ఇరువురు ఎదుటి వ్యక్తులతో సోదర భావాన్ని పెంపొందించుకోవాలని

రాఖీ అంటే కేవలం దారం కాదు ఒక పవిత్రమైన బంధం అని సమాజంలో ఉన్న మనుష్య జాతి అంతా గుర్తించాలి. ఇటువంటి వేడుకలు అందరూ జరుపుకుంటే సమాజంలో సోదర భావం పెంపొంది ఎటువంటి చెడు ఉండకుండా సమాజం లో సత్ కార్యాస్థాపన జరుగుతుంది. అందుకని ప్రతి ఒక్కరూ మనసారా ఈ రక్షాబంధనం అనే రోజున ఖచ్చితంగా ఎంత దూరంలో ఉన్నా సోదరులను కలుసుకొని రక్షాబంధనం కట్టి దీవెనలు తీసుకోవాలి.

**స్మార్ట్ ప్రపంచం లో ఆన్లైన్ లో ను రాఖీ వేడుకలు :-**

ప్రస్తుత సమాజంలో దేశ విదేశాలలో ఉన్న సోదరులను కలుసుకోవాలని ఉన్న కలుసుకోలేని వెసులుబాటు లేని రోజులలో కూడా రాఖీ కట్టాలి అంటే ఆన్లైన్ లో వివిధ రకాల సైట్స్ లో సోదరులకు రాఖీని పంపించవచ్చు తిరిగి సోదరులు సోదరీమణులకు ప్రత్యేకమైన బహుమానాలు ఆన్లైన్ ద్వారా పంపించే నూతన విధానాలు అన్ని వెసులుబాటులోకి వచ్చాయి.

రాఖీ పండుగ శుభాకాంక్షలుతో

రాఖీ విశిష్టత ప్రత్యేక శీర్షిక.....




**ఏ.బాల సౌజన్యకుమారి**
తెలుగు ఆచార్యులుద, ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త
నంది అవార్డు గ్రహీత మహిళా కీర్తి రత్న పురస్కార,
జాతీయ పురస్కార గ్రహీత, అనకాపల్లి

# యధేచ్ఛగా బాల్య వివాహాలు

(హెచ్.ప్రతాప్)



దేశ భవిష్యత్తును నిర్మించే శక్తి యువతలో ఉంది. అలాంటి యువతలో సగభాగమైన బాలికలకు విద్య, ఆరోగ్యం, స్వేచ్ఛ, స్వావలంబన లభించాల్సిన వయస్సులోనే వివాహ బంధంలోకి నెట్టివేయడం వారి జీవితాలను మాత్రమే కాదు, దేశ అభివృద్ధిని కూడా వెనక్కి నెడుతుంది. చట్టపరంగా నిషేధించబడినప్పటికీ, బాల్యవివాహాలు ఇప్పటికీ భారతదేశం ఎదుర్కొంటున్న ప్రధాన సామాజిక సవాళ్లలో ఒకటిగా కొనసాగుతున్నాయి.

భారత చట్టాల ప్రకారం మహిళలకు కనీస వివాహ వయస్సు 18 సంవత్సరాలు, పురుషులకు 21 సంవత్సరాలు. దీనిని ఉల్లంఘించడం బాల్యవివాహ నిషేధ చట్టం--2006 ప్రకారం శిక్షార్హమైన నేరం. అయినప్పటికీ, సామాజిక ఆచారాలు, పేదరికం, అవగాహన లోపం కారణంగా ఈ చట్టం ప్రతి ప్రాంతంలో సమర్థంగా అమలు కావడం లేదు.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం బాల్యవివాహాల శాతం గత రెండు దశాబ్దాల్లో గణనీయంగా తగ్గింది. 2005-06లో 20--24 ఏళ్ల మహిళల్లో 47.4 శాతం మంది 18 ఏళ్లలోపే వివాహం చేసుకోగా, 2023-24 నాటికి ఈ శాతం 20.1కు తగ్గింది. అయినప్పటికీ, ప్రతి ఐదుగురు యువతుల్లో ఒకరు ఇంకా బాల్యవివాహానికి గురవుతుండటం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది.

యూనిసెఫ్ విశ్లేషణ ప్రకారం ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోనే దేశంలోని బాల్యవివాహాల సంఖ్యలో సగానికి పైగా నమోదవుతోంది. జనాభా అధికంగా ఉండటం, గ్రామీణ పేదరికం, విద్యా లోపం వంటి కారణాలు ఇందుకు దోహదపడుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి గతంతో పోలిస్తే మెరుగుపడినప్పటికీ, కొన్ని గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో బాల్యవివాహాలు ఇంకా సవాలుగానే ఉన్నాయి. అందువల్ల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండూ అప్రమత్తతను కొనసాగించాల్సిన అవసరం ఉంది.

భారతదేశంలో బాల్యవివాహాలు ఇప్పటికీ ఆందోళనకర స్థాయిలో కొనసాగుతున్నాయని అనేక ధృవీకరించబడిన సంఘటనలు నిరూపిస్తున్నాయి. అసోంలో 2023 నుంచి ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక చర్యల్లో మూడు వేల మందికిపైగా బాల్యవివాహాలకు పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేయగా, 2024లో మరో 400 మందికి పైగా అదుపులోకి తీసుకున్నారు. కర్ణాటకలో గత మూడేళ్లలో రెండు వేలకుపైగా బాల్యవివాహాలు నమోదవగా, ఆరు వేలకుపైగా బాల్యవివాహాలను అధికారులు ముందుగానే అడ్డుకున్నారు. జాతీయ నేర గణాంకాల ప్రకారం వివిధ రాష్ట్రాల్లో ప్రతి సంవత్సరం వందలాది కేసులు నమోదవుతున్నాయి. అయితే కుటుంబాల మౌనం, సామాజిక ఒత్తిళ్లు, రహస్యంగా జరిగే వివాహాల కారణంగా వాస్తవ సంఖ్య నమోదైన కేసుల కంటే మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

బాల్యవివాహాలకు ప్రధాన కారణాలు పేదరికం, నిరక్షరాస్యత, లింగ వివక్ష, కట్న భయం, బాలికల భద్రతపై కుటుంబాల ఆందోళన, సంప్రదాయ సామాజిక ఆచారాలు. వివాహం జరిగిన వెంటనే చాలామంది బాలికలు చదువును మానేయాల్సి వస్తుంది. చిన్న వయస్సులో గర్భధారణ వల్ల తల్లి, శిశువు ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం పడుతుంది. పోషకాహార లోపం, ప్రసవ సమస్యలు, కుటుంబ హింస, ఆర్థిక ఆధారపడటం, మానసిక ఒత్తిడి వంటి సమస్యలు కూడా పెరుగుతాయి. ఈ పరిస్థితి తరతరాల పేదరికానికి దారితీస్తుంది.

ఈ సమస్యను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల బాల్ వివాహ్ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇది బేటీ బచావో--బేటీ పడావో, మిషన్ వాత్సల్య, పోషణ్ అభియాన్, విద్యా, ఆరోగ్య, పోలీసు, అంగన్‌వాడీ వ్యవస్థలతో సమన్వయం చేస్తూ బాల్యవివాహాల నివారణపై దృష్టి సారిస్తోంది. సుప్రీంకోర్టు కూడా 2024లో రాష్ట్రాలకు ప్రత్యేక బాల్యవివాహ నిరోధక అధికారులను నియమించడం, సాంకేతిక ఆధారిత ఫిర్యాదు వ్యవస్థలు, గ్రామస్థాయిలో పర్యవేక్షణ కమిటీల ఏర్పాటు వంటి చర్యలను బలోపేతం చేయాలని సూచించింది.

ఈ రంగంలో యూనిసెఫ్ , యుఎన్ఎఫ్‌పీఏ , కైలాష్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్, చైల్డ్‌లైన్ 1098, సేవ్ ద చిల్డ్రన్, రాష్ట్ర మహిళా మరియు శిశు సంక్షేమ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, అంగన్‌వాడీ వ్యవస్థలు కలిసి అవగాహన, రక్షణ, పునరావాస కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. ముఖ్యంగా బాలికల విద్య, జీవన నైపుణ్యాలు, కుటుంబ అవగాహన, గ్రామస్థాయి పర్యవేక్షణపై ఈ సంస్థలు విస్తృతంగా పనిచేస్తున్నాయి.

బాల్యవివాహాల నిర్మూలనకు చట్టం ఒక్కటే సరిపోదు. ప్రతి వివాహాన్ని తప్పనిసరిగా నమోదు చేయడం, పాఠశాలలు విడిచిపెట్టే బాలికలను తిరిగి విద్యలోకి తీసుకురావడం, పేద కుటుంబాలకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందించడం, గ్రామస్థాయిలో నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, బాల్యవివాహ సమాచారాన్ని వెంటనే అధికారులకు చేరవేసే వ్యవస్థను బలోపేతం చేయడం అత్యవసరం.

ఒక బాలికను బాల్యవివాహం నుంచి రక్షించడం అంటే ఒక కుటుంబాన్ని, ఒక సమాజాన్ని, ఒక తరాన్ని రక్షించినట్టే. బాలికలు చదువుకుని, స్వయం సమృద్ధిని సాధించి, తమ జీవిత భాగస్వామిని స్వయంగా ఎన్నుకునే వయస్సు వచ్చే వరకు వారికి సంపూర్ణ రక్షణ కల్పించడం ప్రతి ప్రభుత్వానిదే కాదు, ప్రతి కుటుంబం, ప్రతి గ్రామం, ప్రతి పౌరుడి నైతిక బాధ్యత కూడా.

# 'రెండు ఏళ్ల నమ్మకం'-అభివృద్ధి, సంక్షేమం ఇంటింటికి"





## అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించిన హోంమంత్రి అనిత

### మహిళలతో కలిసి కోలాటంలో పాల్గొన్న మంత్రి

**నక్కపల్లి, ఆగస్టు 7 :(జయ జయహే)**

నక్కపల్లి మండలంలోని ఒడ్డిమెట్ట గ్రామంలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పర్యటించారు. "రెండు ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం ఇంటింటికి" ప్రచార కార్యక్రమంలో భాగంగా గ్రామంలో విస్తృతంగా పర్యటించి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. మహిళలు అడుగడుగునా హారతులతో స్వాగతం పలుకగా, స్థానిక మహిళలతో కలిసి హోంమంత్రి కోలాటంలో పాల్గొని సందడి చేశారు. పర్యటనలో భాగంగా మంత్రి వంగలపూడి అనిత తొలుత ఒడ్డిమెట్ట గ్రామంలోని శ్రీ వినాయకస్వామి, శ్రీ ఆంజనేయస్వామి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ పాయకరావుపేట నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమాంతరంగా ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో రూ.660 కోట్లకు పైగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశామని, రూ.500 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టామని వెల్లడించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు ద్వారా వేలాది మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని హోంమంత్రి తెలిపారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా ప్రాంతీయ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని, స్థానిక యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. పాయకరావుపేట నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.




## నేడు డిగ్రీ కళాశాల భవనాలు ప్రారంభం

**మాడుగుల ఆగస్టు 7 జయ జయహే**

మాడుగుల గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాలను శనివారం సాయంత్రం అనకాపల్లి పార్లమన సభ్యుడు సీఎం రమేష్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయనున్నట్టు మాడుగుల పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పుప్పాల లక్ష్మీనారాయణ శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఇస్సానికి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కూడా హాజరవుతారన్నారు. సుమారు కోటి 50 లక్షల రూపాయలు తో, అనకాపల్లి ఎంపీ, జిల్లా కలెక్టర్ సహకారంతో ఈ భవనాలు నిర్మించారు. ఇప్పటివరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొన్నాళ్లు, ప్రస్తుతం ప్రభుత్వ బాలికల వసతి గృహంలో ఈ డిగ్రీ కళాశాల నిర్వహిస్తున్నారు. ఇన్ని రోజుల్లో నూతన భవనాలు నిర్మించడంతో విద్యార్థులకు వసతి సమస్య సమకూర్చినట్టయింది. దంత ఈ భవనాలను ఈనెల 8వ తేదీ సాయంత్రం ప్రారంభించనున్నారు. కాబట్టి కూటమి నాయకులు కార్యకర్తలు,ప్రజలంతా ఈ కార్యక్రమానికి హాజరై విజయం చేస్తారని విజ్ఞప్తి చేశారు.




## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిరోషిమా నాగసాకి సంస్మరణ దినోత్సవం

**చోడవరం ఆగస్టు 7 జయ జయహే**

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో హిరోషిమా నాగసాకి సంస్మరణ దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపల్ , రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సి హెచ్ ఎస్ అనురాధ అధ్యక్షత వహించారు. అలాగే ఐ క్యు ఏసి కోఆర్డినేటర్ ఎం రాజేశ్వరరావు, రసాయన శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ జె లక్ష్మీ మంగమ్మ, జి వెంకటేష్, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ మల్లిబాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు డాక్టర్ వి. రత్నభారతి, డి.మాల్యాద్రి,బి. పిచ్చమ్మ, డాక్టర్ ఎస్ పద్మావతి, డాక్టర్ ఎస్ సూర్యవతి, ఎంవి రామకృష్ణ, తదితర అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు అణ్వాయుధాల వినాశకర ప్రభావాలు, ప్రపంచ శాంతి అవసరం మానవతా విలువల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. శాంతి, సహనం, అహింస వంటి విలువలను ఆచరిస్తూ సమాజ అభివృద్ధికి బాధ్యతాయుత పౌరులుగా వ్యవహరించాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రపంచ శాంతి పరిరక్షణలో యువత పాత్ర ఎంతో కీలకమనే సందేశం అందరికీ చేరింది. ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ నారాయణ, రామలక్ష్మి, కోమల, హేమ గణేష్ ఇతర అధ్యాపక బృందం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




## ఉద్యాన పంటల సాగుతో అధిక ఆదాయం పొందవచ్చు

### రైతులకు అవగాహన కార్యక్రమం

**శ్రీకాళహస్తి, ఆగస్టు 7, జయ జయహే**

శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు గ్రామంలో నేడు ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి (డి హెచ్ ఓ) జయభరత్ రెడ్డి, మండల ఉద్యానవన శాఖ అధికారి (హెచ్ ఓ) పుష్పలత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానశాఖ అధికారి జయ భరత్ రెడ్డి మాట్లాడుతూ వరి సాగుతో పోలిస్తే ఉద్యాన పంటల సాగు ద్వారా రైతులు అధిక ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పంటల వైవిధ్యీకరణ, ఉద్యాన పంటల సాగు ప్రయోజనాలు, ఆయిల్‌పామ్ సాగు ద్వారా కలిగే ప్రయోజనాలు, ఎల్‌నినో ప్రభావం వల్ల పంటలకు కలిగే నష్టాలను నివారించేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై రైతులకు వివరించారు. హెచ్ ఓ పుష్పలత మాట్లాడుతూ ఉద్యానశాఖ ద్వారా అమలు చేస్తున్న వివిధ ప్రభుత్వ పథకాలు, రైతులకు అందుబాటులో ఉన్న రాయితీలు, శ్రీకాళహస్తి ఉద్యాన క్షేత్రంలో అందుబాటులో ఉన్న నాటుసామగ్రి మరియు మొక్కల వివరాలను వివరించారు. అలాగే పిఎండిఎస్ (పోస్ట్ మాన్‌సూన్ డ్రై స్పెల్) కిట్ల వినియోగం, వాటి ద్వారా పంటలను ప్రతికూల వాతావరణ పరిస్థితుల నుంచి రక్షించుకునే విధానాలను వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్త సేంద్రియ పద్ధతుల్లో కూరగాయల సాగు వల్ల కలిగే ప్రయోజనాలు, విత్తన పెల్లెటైజేషన్, చీడపీడలు మరియు తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన సమగ్ర సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈఓ విజయలక్ష్మి, జడ్పీఎన్ఎఫ్ (ఎఫ్ టి యం) ప్రసాద్, గోద్రెజ్ కంపెనీ మేనేజర్ కేశవ నారాయణ, గ్రామంలో రైతులు పాల్గొన్నారు.



## శిశువులకు తల్లిపాలే మహా ఆరోగ్యం పోస్టర్ను ఆవిష్కరించిన కొణతాల

**అనకాపల్లి జయ జయహే**

స్థానిక రింగ్ రోడ్డు జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ పోషకాహారం సౌరక్షణపై అవగాహన కల్పించే ఉద్దేశంతో చంటి పిల్లల జననం నుంచి ఆరు నెలలు వయసు పూర్తయ్యే వరకు శిశువులకు తల్లిపాలే మాత్రమే ఇవ్వాలని తల్లిపాలే మహా ఆరోగ్యమని అంటూ ఆయన అన్ని అంగన్వాడి కార్యకర్తలతో కలిసి పాస్టర్లను ఆవిష్కరించడం జరిగింది అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు పోషక విలువలతో కూడిన నాణ్యమైన ఆహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని చిన్నారుల ఆరోగ్యం అంతమైన ఎదుగుదలలో అంగన్వాడి కేంద్రాల సేవలు ఎంతో కీలకమైన వని ఆయన పేర్కొన్నారు అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్వు వంట పాత్రలు మరియు విధులు నిర్వహిస్తున్న అంగన్వాడీ టీచర్లకు చీరలు పంపిణీ చేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో సిడిపిఓ రమణకుమారి ఏ సి డి పి ఓ శశికళ గవర కార్పొరేషన్ డైరెక్టర్ వెల్లూరి హరి 83వ వార్డు జనసేన పార్టీ ఇన్చార్జ్ మంగ ఈశ్వర్ కూటమి నాయకులు అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు





# లోకేష్ రాజీనామా చేయాల్సిందే...!

## రెండో రోజు దీక్షలో కేకే రాజు

**విశాఖపట్నం, ఆగస్టు 7, జయ జయహే :**

డీఎస్సీ నియమకాల్లో జరిగిన అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని, విచారణ నిష్పక్షపాతంగా జరగాలంటే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాల్సిందేనని వైసీపీ జిల్లా అధ్యక్షులు కేకే రాజు అన్నారు. డీఎస్సీ-2025 ఉపాధ్యాయ నియామకాలలో జరిగిన అవకతవకలకు నిరసనగా విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిధిలోని సత్యం జంక్షన్ వద్ద 2వ రోజు జరిగిన రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడుతూ దగాపడ్డ ప్రతి డీఎస్సీ అభ్యర్థులు తరుపున, ఫీజు రియంబర్స్మెంట్ రాలేని విద్యార్థులు తరపున మా నాయకుడు వై.యస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో మా పోరాటం కొనసాగుతూనే ఉ ంటుందన్నారు. విద్య వైద్య రంగాలలో పెను మార్పులు తీసుకొచ్చిన ఘనత నాడు వై.యస్ రాజశేఖర్ రెడ్డి అయితే నేడు వైయస్ జగన్మోహన్ రెడ్డిదేనని పేర్కొన్నారు. నేడు విద్య, వైద్య రంగానికి తూట్లు పొడిచిన ఘనత ఈ కూటమి ప్రభుత్వానిదేనని ఆరోపించారు. ఎన్నికలకు ముందు విద్యార్థులకు, యువకులకు అండగా ఉంటామని తప్పుడు హామీలు ఇచ్చి గెలిచిన తర్వాత యువత విద్యార్థులును మోసం చేసిన ఘనత ఈ కూటమి ప్రభుత్వానిదేనని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగులు,విద్యార్థులు,మేధావులు మరియు మాజీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్,నియోజకవర్గ పరిశీలకులు ,బాణాల శ్రీనివాసరావు, విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీవత్సవ, బూత్ కన్వీనర్లు,మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు వివరించిన ఎమ్మెల్యే మురళీమోహన్

**బంగారుపాలెం,ఆగస్టు 7,జయ జయహే.**

ఎమ్మెల్యే మురళీ మోహన్ ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు వివరించారు. ఎమ్మెల్యే మురళీమోహన్. తుమ్మ కుప్పం గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం పర్యటించి సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమం లో బి.కే.గిరిబాబు బంగారుపాలెం మండల తెలుగు యువత మాజీ అధ్యక్షుల. కే.రమేష్, కస్టర్ ఇంచార్జ్,బంగారుపాలెం మండల తెలుగు యువత మాజీ అధ్యక్షులు గిరిబాబు. హరి. పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తు కోసం ఈ పోరాటం

**మాడుగుల ఆగస్టు 7 జయ జయహే**

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఈ పోరాటం చేస్తున్నామని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు చెప్పారు. పార్టీ ఆదేశాల మేరకు చేస్తున్న ఈ కార్యక్రమంలో డీఎస్సీ అవకతవకులపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. రెండో రోజు దీక్ష కార్యక్రమంలో భాగంగా ఆయన శు క్రవారం మాడుగుల బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన దీక్ష శిబిరం వద్ద విలేకరులతో మాట్లాడారు. చీడికాడ మండలానికి చెందిన పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు దీక్షలో పాల్గొన్నారు. వారితోపాటు మాడుగుల మండలం చెందిన ముఖ్య నాయకులు కూడా సంఘీభావం తెలిపి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బూడి మాట్లాడుతూ ఈ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చలగాటమాడుతుందని మండిపడ్డారు. నిరుద్యోగులకు ఉద్యోగ భృతి వెంటనే అందజేయాలని, వారికి చెల్లించాల్సిన బకాయిలు కూడా వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చీడికాడ మండల వైస్సార్సీపీ అధ్యక్షులు గొల్లవెల్లి రాజబాబు,ఉపాధ్యక్షులు ఈర్లి చైతన్య, ఎంపీపీ కురచ జయమ్మ నారాయణ మూర్తి,వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి కొండబాబు,వైస్ ఎంపీపీ రమనమ్మ సన్యాసిరావు,మండల యువజన శాఖ అధ్యక్షులు గొల్లవెల్లి స్వామినాయుడు,సర్పంచులు,చుక్క అప్పల నాయుడు, సలది గంగ శేషు,గంట మత్సరాజు,నందరపు రమణ బాబు,పాల సంగం అధ్యక్షులు రెడ్డి బలరాం,పాతాళ చిన్నం నాయుడు,పరవాడ మహేష్,పరవాడ రామారావు అలాగే మాడుగుల మండల నాయకులు వి రామధర్మజ, ఓం శ్రీ శ్రీనివాస రావు, సేనాపతి కొండలరావు, ఎస్ శ్రీనివాసరావు, పడాల అప్పలనాయుడు, కే శ్రీధర్, ఎన్ నాగ శంకర్, ఎం అశోక్, వై అప్పారావు, భాస్కర్ మురళి తదితరులు పాల్గొన్నారు

# శ్రీ ప్రకాష్‌లో ఘనంగా ప్రారంభమైన సీబీఎస్ఇ సౌత్ జోన్-1 హ్యాండ్ బాల్ పోటీలు

**పాయకరావుపేట జయ జయహే ఆగస్ట్ 7**

శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలో సీబీఎస్ఇ సౌత్ జోన్-1 హ్యాండ్ బాల్ పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, తమిళనాడు రాష్ట్రాల సీబీఎస్ఇ స్కూల్స్ నుండి సుమారు 2500 మంది క్రీడాకారులు అండర్-14,17,19 బాల బాలికల విభాగాల్లో పాల్గొనడానికి విచ్చేసారు. ఈ పోటీలను ప్రముఖ కెమికల్ ఇంజనీరింగ్ శాస్త్రవేత్త మరియు రిటైర్డ్ జనరల్ మేనేజర్ (టెక్నికల్), ఆంధ్రా షుగర్స్ లిమిటెడ్ , తణుకు ఎల్ నగేష్ కుమార్ ప్రారంభించారు. ప్రారంభ మ్యాచ్ సర్ సి.ఆర్.రెడ్డి పబ్లిక్ స్కూల్, ఏలూరు, ఆంధ్రప్రదేశ్ మరియు పి.ఎస్.బి.బి. మిలీనియం స్కూల్, కోయంబత్తూరు, తమిళనాడు జట్ల మధ్య జరుగగా పి.ఎస్.బి.బి. మిలీనియం స్కూల్, కోయంబత్తూరు, తమిళనాడు జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా విచ్చేసిన ఎల్. నగేష్ కుమార్ మాట్లాడుతూ... ఇంతమంది విద్యార్థులు ఒకేచోట క్రీడల నందు పాల్గొనడం ఆనందదాయకమని, పోటీల నందు పాల్గొనడానికి విచ్చేసిన ప్రతీ విద్యార్థి విజేత అని, గెలుపు, ఓటములు సహజమని, వాటిని సమానంగా స్వీకరించేవారే అసలైన విజేత అని ఆయన తెలిపారు. విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ 4 రోజుల పాటు జరగనున్న ఈ పోటీలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని, రాత్రి సమయంలో కూడా ఫ్లడ్ లైట్స్ వెలుతురు లో ఈ పోటీలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపల్ ఎం.వి.వి.ఎస్. మూర్తి, ప్రిన్సిపల్ రవి, సీబీఎస్ఇ పర్యవేక్షకులు స్వామి, వివిధ రాష్ట్రాల సీబీఎస్ఇ పాఠశాలల కు చెందిన క్రీడాకారులు,



జట్లు కోచ్లు, మేనేజర్లు పాల్గొన్నారు.

**మొదటి రోజు పోటీల వివరాలు :**

ఎరైజ్ ఇంటర్నేషనల్ స్కూల్, కురంగు చావడి, తమిళనాడు జం ఏ ఆర్ బి ఇంటర్నేషనల్ స్కూల్, తలక్కారై, తమిళనాడు

గెలిచిన జట్టు ఏ ఆర్ బి ఇంటర్నేషనల్ స్కూల్, తలక్కారై, తమిళనాడు

ఎస్ వి వి పి ఇంగ్లీష్ మీడియం స్కూల్, ఆళ్వార్ స్కూల్ విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ జం పీస్ ఆన్ గ్రీన్ ఎర్త్ పబ్లిక్ స్కూల్, కున్రత్తూర్, తమిళనాడు

గెలిచిన జట్టు పీస్ ఆన్ గ్రీన్ ఎర్త్ పబ్లిక్ స్కూల్, కున్రత్తూర్, తమిళనాడు

వెస్ట్ బెర్రీ స్కూల్, తెనాలి, ఆంధ్రప్రదేశ్ జం జికే శెట్టి వివిఎస్ స్కూల్, అంబత్తుర్, తమిళనాడు

లిగెలిచిన జట్టు జి కే శెట్టి వి వి ఎస్ స్కూల్, అంబత్తుర్, తమిళనాడు

ఫార్చ్యూన్ బటర్ ఫ్లై స్కూల్, కడతల్, తెలంగాణా జం స్లాట్ ది స్కూల్, తిరుపతి, ఆంధ్రప్రదేశ్

గెలిచిన జట్టు స్లాట్ ది స్కూల్, తిరుపతి, ఆంధ్రప్రదేశ్

ఆర్ జి ఎం ఇంటర్నేషనల్ స్కూల్, నంద్యాల, ఆంధ్రప్రదేశ్ జం వెలమల విద్యాలయం, మీనంబాకం, తమిళనాడు

గెలిచిన జట్టు వెలమల విద్యాలయం, మీనంబాకం, తమిళనాడు

శ్రీ క్రిష్ ఇంటర్నేషనల్ స్కూల్, రెడ్ హిల్స్, తమిళనాడు జం వెలమల విద్యాలయం, మంగాడు,తమిళనాడు

గెలిచిన జట్టు వెలమల విద్యాలయం, మంగాడు, తమిళనాడు

ఫార్చ్యూన్ బటర్ ఫ్లై స్కూల్, కడతల్, తెలంగాణా జం మాంటిస్సోరి ఎలైట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, అనంతపూర్, ఆంధ్రప్రదేశ్

గెలిచిన జట్టు మాంటిస్సోరి ఎలైట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, అనంతపూర్, ఆంధ్రప్రదేశ్

సృష్టి వరల్డ్ స్కూల్, ఉక్కునగరం, ఆంధ్రప్రదేశ్ జం కెఆర్ఎమ్ పబ్లిక్ స్కూల్, పెరంబూరు, చెన్నై

గెలిచిన జట్టు కెఆర్ఎమ్ పబ్లిక్ స్కూల్, పెరంబూరు, చెన్నై

చిరాక్ ఇంటర్నేషనల్ స్కూల్, కొండాపూర్, తెలంగాణ జం మదర్ థెరిసా ఇంగ్లీష్ మీడియం స్కూల్, చిత్తూరు, ఆంధ్రప్రదేశ్

గెలిచిన జట్టు మదర్ థెరిసా ఇంగ్లీష్ మీడియం స్కూల్, చిత్తూరు, ఆంధ్రప్రదేశ్

శ్రీ ప్రకాష్ విద్యానికేతన్, పాయకరావుపేట, ఆంధ్రప్రదేశ్ జం వెలమల విద్యాలయం, అన్నంబాకం, తమిళనాడు

గెలిచిన జట్టు శ్రీ ప్రకాష్ విద్యానికేతన్, పాయకరావుపేట, ఆంధ్రప్రదేశ్




## కొండగోకిరి సచివాలయంలో పారిశుధ్య కార్యక్రమం

### ఎంపీడీఓ జిడివి ప్రసాద్ తనిఖీ...

**కొయ్యురు : (జయ జయహే )న్యూస్ ఆగష్టు 08,**

అల్లూరి జిల్లా కొండగోకిరి సచివాలయంలో శుక్రవారం పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొయ్యూరు మండల ఎంపీడీఓ జిడివి ప్రసాద్ పాల్గొని సచివాలయ ప్రాంగణాన్ని శుభ్రం చేయించారు. అనంతరం సచివాలయంలో రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు, ప్రజా సమస్యల పరిష్కారంపై ఆరా తీశారు. సచివాలయంలో ఎప్పుడూ పరిశుభ్రత పాటించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సేవలు అందించాలని సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.



## మధురవాడ రైతు బజార్‌లో తక్కువ ధరకే సన్నబియ్యం విక్రయాలు.

### స్టాళ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే గంటా.

**మధురవాడ,జయ జయహే :**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు బజార్లు,రైస్ మిల్లర్ల సౌజన్యంతో మధురవాడ రైతు బజార్‌లో తక్కువ ధరలకే బియ్యం విక్రయించే ప్రత్యేక స్టాళ్లను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. బహిరంగ మార్కెట్‌లో కేజీ బిపిటి స్టీమ్ బియ్యం ధర 62ఉండగా ఇక్క52లకే,58లు ఉన్న రా-బియ్యాన్ని 50లకే అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే గంటా మాట్లాడుతూ... పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కలిగించేందుకే ఈఏర్పాటు చేశామని,ప్రతినెలా ఒక కార్డుపై గరిష్టంగా 10 కేజీల వరకు బియ్యం కొనుగోలు చేయవచ్చని చెప్పారు. ఈఅవకాశాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలని కోరారు. బియ్యం కొనుగోలుకు రేషన్ కార్డు,ఆధార్ వివరాలు తప్పనిసరి అని స్పష్టం చేశారు. మధురవాడ రైతు బజార్‌లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు,రెండవ రోడ్డు(శివశక్తినగర్ రోడ్డు వైపు)మార్గంపై త్వరలోనే అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు బజార్ డిడి శ్రీనివాస్ కిరణ్,మార్కెటింగ్ జీడీ సుధాకర్,ఈవో దాట్ల హరిత,స్థానిక నాయకులు నమ్మి రమణ,నాగోతి వెంకట సత్యనారాయణ,పిల్లా వెంకటరావు,చలుమూరి శ్రీనివాస్,నాగోతి సూర్య ప్రకాష్,కానూరు అచ్యుతరావు,బోయి శ్రీను, రమాదేవి,నోడగల జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు గృహ నిర్బంధం

**నక్కపల్లి జయ జయహే.**



సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజును ఎస్.రాయవరం మండలం ధర్మవరం అగ్రహారం స్వగ్రామంలో శుక్రవారం గృహనిర్బంధంలో ఉంచారు. నక్కపల్లి మండలం గునిపూడిలో భూములను స్టీల్ ప్లాంట్ టౌన్షిప్ కు ఇచ్చేది లేదని స్పష్టం చేస్తూ నిర్వహిస్తూన్న నిరసన కార్యక్రమానికి అప్పలరాజు మద్దతు ప్రకటించారు. అక్కడికి వెళ్లకుండాను మరియు రాష్ట్ర హోం శాఖ మంత్రి నియోజకవర్గంలో పర్యటించడం వలన ఈ గృహ దానిర్బంధం చేసారు దీనిని సిపిఎం జిల్లా కార్యదర్శి జీ.కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.సత్యనారాయణ, ఎం.రాజేష్ లు తీవ్రంగా ఖండించారు. గృహ నిర్బందాలతో ఉద్యమాలు ఆపలేరని,ప్రజలు పక్షాన నిరంతరం సిపిఎం పోరాడుతుందని తెలిపారు




## ఇటుక బట్టీల కాలుష్యంపై అధికారుల నిర్లక్ష్యం

### రాజానగరం ప్రజల ఆగ్రహం

**పాయకరావుపేట జయ జయహేఆగస్ట్ 7**

మండలంలోని రాజానగరం గ్రామం సమీపంలో ఉన్న ఇటుక బట్టీల వల్ల తీవ్ర కాలుష్యం ఏర్పడి అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదని వారు తెలిపారు. గత 15 రోజులుగా విఆర్ఓ చొరవతో ఇరువర్గాల మధ్య చర్చలు జరిపి సమస్యను పరిష్కరించేందుకు తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరిగినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. అధికారులు తమ సమస్యను కనీసం పట్టించుకోవడం లేదని బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల ఉదాసీన వైఖరి వల్ల గ్రామంలోని పిల్లలు, వయోవృద్ధులు ఆరోగ్య సమస్యలతో అల్లాడుతున్నారని పేర్కొంటూ ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు గ్రామస్థులు ఆందోళన బాట పట్టారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి ఇటుక బట్టీ కాలుష్యంపై తగిన చర్యలు తీసుకోవాలని రాజానగరం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గరికిన శ్రీను (రాజానగరం హై స్కూల్ చైర్మన్), పిరాది శ్రీను, చొక్కా ప్రకాష్, బొందు కొండయ్య, వంకా దేవుడు, పారా జగన్నాథం, తాడి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



## కాపు జాతి కాగడా...ముద్రగడ..!

### 9న విశాఖలో ముద్రగడ సంస్మరణ సభకు తరలిరండి

### విశాఖ కాపునాడు అధ్యక్షులు తోట రాజీవ్ పిలుపు

**విశాఖపట్నం, ఆగస్టు 7, జయ జయహే :**

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, కాపు జాతికి వెలుగునిచ్చిన కాగడా, అణగారిన వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయం, సమానత్వం, సంక్షేమం కోసం జీవితాంతం అహర్నిశలు పోరాడిన మహనీయుడు ముద్రగడ పద్మనాభంకి ఘన నివాళులు అర్పించేందుకు విశాఖలో భారీ సంస్మరణ సభను నిర్వహిస్తున్నట్లు విశాఖ కాపునాడు జిల్లా అధ్యక్షులు తోట రాజీవ్ తెలిపారు. ఆగస్టు 9న ఉదయం 10 గంటలకు, విశాఖ సిరిపురం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరేనాలో ఈ సంస్మరణ సభ నిర్వహించనున్నామని వెల్లడించారు. ముద్రగడ పద్మనాభం తన జీవితాన్ని అణగారిన వర్గాల సంక్షేమానికి అంకితం చేసిన మహోన్నత వ్యక్తిత్వమని, కాపు సమాజం మాత్రమే కాకుండా అన్ని వర్గాల ప్రజల గౌరవాన్ని పొందిన ప్రజానాయకుడిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా, విశాఖ జిల్లాలోని అన్ని సామాజిక సంఘాల ఐక్యతతో “విశాఖ కాపునాడు” ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. సామాజిక సమానత్వం, కాపు సమాజ హక్కుల పరిరక్షణ, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో ఉద్యమాలు చేపట్టి ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు భావితరాలకు మార్గదర్శకమని, సమాజం కోసం నిస్వార్థంగా పోరాడిన అలాంటి మహానుభావుడిని స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. ముద్రగడ పద్మనాభం ఆశయాలను కొనసాగిస్తూ సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సభలో పాల్గొని మహానేతకు ఘన నివాళులు అర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభ పోస్టర్‌ను తోట రాజీవ్ ఆధ్వర్యంలో నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు పీవీ సురేష్, కసిరెడ్డి సత్యనారాయణ, గుంటూరు నరసింహమూర్తి, వంగా ప్రభాకర్ రావు, గుడివాడ లతీష్, నవీన్, సుబ్బా విశ్వనాథ్, రాయుపు రెడ్డి అనిల్, కోసల శ్యామల దేవి, పండుగ్రి జయరాజు నాయుడు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు

**శిరివెళ్ళ (జయ జయహే)**

ఇసుకపల్లి గ్రామంలో వెలసిన శ్రీశివరామాలయం నందు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారం గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలతో అత్యంత వైభవంగా ముగిశాయి. ఇస్కాన్ ధర్మ ప్రచారకులు పద్మనాభ దాస్, నిత్యతృప్తదాస్, వేంకటేశ్వర్లు చేసిన ప్రవచనాలు భక్తులను ఎంతగానో అలరిచాయి. శుక్రవారం అర్చకులు గుండంపాటి సత్యనారాయణ శర్మ భక్తులందరిచే సామూహిక గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ధార్మిక వ్యాప్తిలో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలుజిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు రెడ్డి, వెంకట నారాయణరెడ్డి, కె. నరసింహారెడ్డి, డి. ఆంజనేయులు రెడ్డి, హరిశ్చంద్రారెడ్డి, గురుమూర్తి, పి. రమణమూర్తితోపాటు భక్తసమాజం పాల్గొన్నారు.




## “నిబంధనలు పాటిస్తేనే ప్రాణాలకు భద్రత”

**రాజమహేంద్రవరం: జయ జయహే :ఆగస్టు 7**

జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు ధవళేశ్వరం బస్టాండ్ వద్ద శ్రీ లక్ష్మీ గణపతి ఆటో యూనియన్ డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రత, మాదకద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ గణేష్ మాట్లాడుతూ, “ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరి ప్రాణ భద్రత కోసం రూపొందించబడినవే. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలు నిలిపివేయడం ప్రమాదాలకు దారి తీస్తుంది. ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండి బాధ్యతాయుతంగా వాహనం నడపాలి. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ యువత ఆదర్శప్రాయమైన జీవితం గడపాలి. పోలీసు--ప్రజల మధ్య సత్సంబంధాలే ‘యూత్ కనెక్ట్’ కార్యక్రమం ప్రధాన లక్ష్యం” అని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ గణపతి ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు వాసిరెడ్డి బాబి, యూనియన్ అధ్యక్షుడు బుజ్జి, ఎస్ఐ హరిబాబుతో పాటు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.




## ఘనంగా తల్లిపాలు వారోత్సవాలు

**బుచ్చయ్యపేట జయ జయహే**

రావికమతం ప్రాజెక్ట్ సి. డి పి. ఓ తురకలపూడి సెక్టార్ పరిధిలో కరక, తురకలపూడి, తైపురం అంగన్వాడి కేంద్రాల్లో ఈ తల్లిపాలు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. రావికమతం ప్రాజెక్ట్ సిడిపిఓ మంగతాయారు ఆదేశాల మేరకు అంగన్వాడి సిబ్బంది మరియు సూపర్వైజర్ ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సూపెరవైజర్ హైమావతి మాట్లాడుతూ తల్లిపాలు ప్రాముఖ్యత,తల్లిపాలు ఇవ్వడం వల్ల వచ్చే ప్రయోజనాలు.తల్లి పాలు తాగడం ద్వారా పిల్లలకు ఐక్యూ శక్తి పెరుగుతుందని,మహిళలు వచ్చే విధంగా రకరకాల క్యాన్సర్లు నివారించవచ్చని తల్లిపాలు తాగే పిల్లలు ఆరోగ్యం ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ హేమావతిపి. కరక అంగన్వాడీ సిబ్బది .కే. కాసులమ్మ, తురకలపూడి అంగన్వాడీ సిబ్బది జీ. రాజామణి, ఏ. ముత్యాలమ్మ, తైపురం అంగన్వాడీ సిబ్బది పి. వెంకటాలక్ష్మి , గర్భిణీల స్త్రీలు,బాలింతలు పిల్లల తల్లిదండులు తదితరులు పాల్గొన్నారు.

## కొయ్యూరు హౌసింగ్ నూతన ఏఈగా దామోదరరావు..

### బాధ్యతలు స్వీకరించిన వెంటనే సమీక్ష..

**కొయ్యురు : (జయ జయహే )న్యూస్ ఆగష్టు 08,**



అల్లూరి జిల్లా కొయ్యూరు మండల హౌసింగ్ నిర్మాణాల పురోగతిని వేగవంతం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) గా దామోదరావు గురువారం నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే కార్యాలయ సిబ్బందితో సమావేశమై మండలంలో జరుగుతున్న హౌసింగ్ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్లు, ఫీల్డ్ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దామోదరరావు మాట్లాడుతూ, “ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇళ్ల నిర్మాణ పథకాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడం మా ప్రధాన లక్ష్యం. మండలంలో పెండింగ్ లో ఉన్న ఇళ్ల పనులను వేగంగా పూర్తి చేసి, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సొంత ఇంటి కలను నిజం చేస్తాం. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తాం” అని అన్నారు. మండలంలో ఇప్పటికే మంజూరైన ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తామని స్పష్టం చేశారు.

# రాష్ట్రపతి ఉత్తర్వుల నుంచి జీవీఎంసీ ఉద్యోగులను మినహాయించాలి





## మినిస్టీరియల్ ఉద్యోగుల్ని ఒకే యూనిట్‌గా కొనసాగించాలి

### ప్రెసిడెన్షియల' ఆర్డర్ పై పునరాలోచించాలి

### ఎమ్మెల్యేల వద్దకు జీవీఎంసీ ఉద్యోగులు

**విశాఖపట్నం, ఆగస్టు 7, జయ జయహే**

ఉత్తర్వుల నుంచి తమను మినహాయించాలంటూ జీవీఎంసీ మినిస్టీరియల్ ఉద్యోగులు ఎమ్మెల్యేలకు విన్నవిస్తున్నారు. చట్టంలోని సెక్షన్లు చూపిస్తూ ఉన్నతాధికారులకు లేఖలు కుడా రాశారు. తమ సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి న్యాయం చేయాలంటూ తాజాగా శుక్రవారం ఎమ్మెల్యేల్ని ఆశ్రయించారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా తమకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్టు పలువురు ఉద్యోగ సంఘ నేతలతో పాటు బాధితులు ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీలోని మినిస్టీరియల్ ఉద్యోగులకు సంబంధించి అందర్నీ ఒకే యూనిట్‌గా కొనసాగించడంతో పాటు నియామక అధికారిగా కమిషనర్ నే యథాతథంగా ఉంచాలంటూ విజ్ఞప్తి చేశారు. జీవో 135పై పునఃపరిశీలించాలని కోరుతున్నారు. జీవీఎంసీ అనేది ప్రత్యేకంగా రూపొందించబడిన 'విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ చట్టం, 1979' నిబంధనల ప్రకారం నిర్వహించబడుతుందని గుర్తు చేశారు. మినిస్టీరియల్ విభాగం ఒకే యూనిట్‌గా పని చేస్తోందని, తదనుగుణంగా ప్రత్యేక సర్వీసు నిబంధనలు రూపొందించబడ్డాయని గుర్తు చేశారు. ఇప్పటి వరకు జీవీఎంసీ ఉద్యోగులకు సంబంధించి ఎటువంటి సర్వీసు ప్రొవిన్షియలైజేషన్ (రాష్ట్ర స్థాయి సర్వీసులో విలీనం) ప్రక్రియ చేపట్టలేదని, స్థానిక సంస్థలకు చట్టబద్ధమైన గ్రాంట్లు విడుదల చేయడానికి బదులు ప్రభుత్వం ద్వారానే జీతాలు చెల్లించబడుతున్నాయన్నారు. వీరి సర్వీసు షరతులు 'విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ చట్టం, 1979' దాని కింద రూపొందించబడిన ప్రత్యేక సర్వీసు నిబంధనల ద్వారానే నిర్వహించబడుతున్నాయన్నారు. వీటిలో వీరిని రాష్ట్ర స్థాయి సర్వీసుగా కాకుండా ఒకే యూనిట్‌గా పరిగణించడం జరుగుతోందన్నారు. ఇలా మొత్తం ఆ చట్టంలోని ముఖ్యమైన 9అంశాల్ని ఎమ్మెల్యేల దృష్టికి ఉద్యోగులు తీసుకు వెళ్లారు. ఎమ్మెల్యేలను కలిసిన వారిలో వీఎంసి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వివి వామన్ రావు, గుమ్మడి నర్సింగ్, జీవీఎంసీ ఏఐటీయూసీ అధ్యక్షులు పడాల రమణ, కార్యదర్శి ప్రియదర్శిని, ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్కరబోయిన అప్పలరాజు, కోశాధికారి రవి, జివిఎంసి మినిస్టీరియల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ.అప్పలనాయుడు, సన్నీ, క్లాస్ ఫోర్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గణపతి, జీవీఎంసీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శ్రీనుబాబు, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు



# తల్లి పాలే పిల్లలకు శ్రేయస్కరం

**చింతపల్లి, ఆగస్టు 7, జయ జయహే**

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా చింతపల్లి-1 ఆరోగ్య ఉపకేంద్రంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రోజి వినీతాంజలి మాట్లాడుతూ పుట్టిన వెంటనే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం, మొదటి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలు మాత్రమే ఇవ్వడం, అనంతరం తగిన అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలు కొనసాగించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచి, వివిధ అంటువ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయని, శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదల, సమగ్ర అభివృద్ధికి తల్లిపాలు ఎంతో కీలకమన్నారు. గర్భిణీ స్త్రీలు ఆసక్తిగా పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచఈఓ ఎం. జాన్సన్, ఎంఎల్‌హెచ్‌పీ ఆర్. శ్రావణి, ఎఎనఎంలు నాగరత్నం, కుమారి, ఆశాలు పాల్గొన్నారు.



# లోకేష్ రాజీనామా చేయాలి

## ఎంబీసీ మాజీ చైర్మన్ పెంద్ర వీరన్న

**విశాఖపట్నం, ఆగస్టు 7, జయ జయహే :**


వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజవర్గాల్లో డీఎస్సీ బాధితుల పక్షాన రిలే నిరాహార దీక్షలు 2వ రోజు చేపట్టారు, ఈ సందర్భంగా శుక్రవారం పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం,తణుకు నియోజకవర్గాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో స్థానిక మాజీ శాసనసభ్యులు పార్టీ జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాదరాజు, ముదునూరి మురళీకృష్ణ రాజు, పార్టీ ఎంబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు, స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెంద్ర వీరన్న. స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు పిడి రాజు, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, మాజీ ఎస్సీ కమిషన్ సభ్యులు చెలెం ఆనంద ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు, అనంతరం ఎంబీసీ మాజీ చైర్మన్ పెంద్ర వీరన్న మాట్లాడుతూ డీఎస్సీ నిర్వహణలో భారీగా అవినీతి, అక్రమాలు జరిగాయని, దీనికి పూర్తి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సాయంత్రం తణుకు నియోజకవర్గం మాజీ మంత్రివర్యులు డాక్టర్ కారుమూరి వెంకట నాగేశ్వరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్ష కార్యక్రమంలో పాల్గొన్న పెంద్ర వీరన్న మాట్లాడుతూ. కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువత భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని, అర్హులైన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని వీరన్న విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎసఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వండ్లూరి సీతారామయ్య, బుద్ధరపు భరణి ప్రసాద్, సాయిబాబా రెడ్డి , తదితర ప్రముఖులు పాల్గొన్నారు

# ప్రకృతి ఆధారంగా పంటలు పండించండి

### - భూమిని విష రసాయనాలతో నింపొద్దు

### - ప్రకృతి ఆధారిత పంటలే ఆరోగ్యకరం- బి. సత్యశ్యామల,

**విశాఖపట్నం (జయ జయహే)**



ప్రకృతి ఆధారంగా పంటలు పండించండి అని ఎపిసిఎన్ఎఫ్ విశాఖ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి సత్య శ్యామల కోరారు. శుక్రవారం ఉదయం విశాఖ జంతుప్రదర్శన శాలకు చేరువలో ఉన్న విశాఖ వ్యాలీ విద్యాసంస్థ లో ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్ అద్యక్షతన విద్యార్థులు కూరగాయలు, ఆకుకూరలు, ట్రే నర్సరీ, ఒక ప్రాచీన గ్రామం మినియేచర్ ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో సత్యశ్యామల మాట్లాడుతూ భూమిని విష రసాయనాలతో నింపొద్దు అని కోరారు. ప్రకృతి ఆధారిత పంటలే ఆరోగ్యకరం అని వివరించారు. విద్యార్థులకు ప్రకృతి ఆధారంగా పంటలు పండించడం విషయం లో శిక్షణ ఇవ్వడం ద్వారా వారు ఎలాంటి ఆహారం తీసుకోవాలి అనే అంశంపై అవగాహన కల్పించడం అవసరం అని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తమ ఇంటి వద్ద కూరగాయలు పండించాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్ మాట్లాడుతూ తమ విద్యార్థులకు అన్ని రకాల కళల పట్ల శిక్షణ ఇవ్వడం జరిగుతోంది అని వివరించారు. అంతే కాక ఆయా విభాగాలకు ఇంచార్జీ లను ఏర్పాటు చేశామని వివరించారు. విద్యార్థులకు ఎన్ని విధాలుగా ఏమేమి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరిగుతుంది తెలియజేశారు. తమ విద్యార్థులకు అన్ని రంగాల్లో శిక్షణ ఇవ్వడం జరిగుతోంది అని పేర్కొన్నారు. ప్రకృతి వనరులను కాపాడుకోవడం, పర్యావరణ పరిరక్షణ, శీతోష్ణస్థితి వేడెక్కకుండా కృషి చేయాలని వారికి అవగాహన కల్పించడం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రి స్కిల్ సిఇఒ వి. మెహర్ ప్రసాద్, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం తదితరులు పాల్గొని మాట్లాడారు.

# గురాన అయ్యులు" పై 'దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం'..

### నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**విజయనగరం (జయ జయహే)**


ప్రముఖ సంఘ సేవకులు,జనసేన పార్టీ సీనియర్ నాయకులు గురాన అయ్యులుపై కొంతమంది వ్యక్తులు ఇంటికి వెళ్లి దాడికి పాల్పడిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రముఖ సామాజిక కార్యకర్త,జనసేన పార్టీ సీనియర్ నాయకులు త్యాడ రామకృష్ణారావు(బాలు) పేర్కొన్నారు.రాజకీయ విభేదాలు, వ్యక్తిగత అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ వాటిని ప్రజాస్వామ్య పద్ధతుల్లో పరిష్కరించుకోవాలే తప్ప, ఇంటికి వెళ్లి దాడులకు పాల్పడటం అత్యంత దారుణమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో హింసకు, బెదిరింపులకు ఎలాంటి స్థానం లేదని స్పష్టం చేశారు.ఇంటికెళ్లి దాడి చేయడం ద్వారా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. ఈఘటనపై పోలీసులు వెంటనే సమగ్ర దర్యాప్తు చేపట్టి, దాడికి పాల్పడిన వారిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శాంతిభద్రతలను కాపాడుతూ, ప్రతి పౌరుడి భద్రతకు ప్రభుత్వం మరియు పోలీసు యంత్రాంగం పూర్తి బాధ్యత వహించాలని త్యాడ రామకృష్ణారావు (బాలు) డిమాండ్ చేశారు.




# వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా ప్రఖర్ జైన్

### బదిలీతో తేజ్ భరత్‌కు షాక్

**విశాఖపట్నం, ఆగస్టు 7, జయ జయహే**



వీఎంఆర్‌డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్. తేజ్ భరత్ కు కూటమి సర్కార్ షాక్ ఇచ్చింది. కమిషనర్ నుంచి రిలీవ్ చేసి జీఏడీకి రిపోర్ట్ చేయాలని ఆదేశిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో రియల్ టైం గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) సీఈవో ప్రఖర్ జైన్ ను వీఎంఆర్‌డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా బదిలీ చేసింది.ఉత్తర ప్రదేశ్ కు చెందిన ప్రఖర్ జైన్ 2021లో ఏపీ కేడర్‌కు ఎంపికైన ఐఏఎస్ అధికారి. ఈయన 2016లో ఐఐటీ కాన్పూర్ నుంచి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. 1994లో జన్మించిన ఈ యువ అధికారి నాలుగో దఫా ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. అంతకు ముందు డిఫెన్స్ అకౌంట్స్ సర్వీస్‌కు ఎంపికయ్యారు. అనంతరం ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. ఇదిలా ఉండగా ఇప్పటి వరకూ కమిషనర్‌గా ఉన్న తేజ్‌భరత్‌పై అవినీతి ఆరోపణలు పెద్ద ఎత్తున చెలరేగాయి. రాజమండ్రి మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న కాలంలో అక్కడి ప్రైవేట్ బ్యాంకు అధికారులతో కుదిరిన ఒప్పందం మేరకు వీఎంఆర్‌డీఏకు చెందిన రూ. వందలాది కోట్లను ఆయా బ్యాంకుల్లో డిపాజిట్ చేయడంపై అవినీతి ఆరోపణలు గుప్పుమన్నాయి. తాజాగా కార్యదర్శిపై కూడా ఆరోపణలు తారా స్థాయికి చేరుకుంటున్న తరుణంలో బదిలీలు పెద్ద చర్చకు దారి తీశాయి.



# డీఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణ జరిపించాలి:

### శ్రీకాళహస్తి దీక్షలో బియ్యపు మధుసూదన్ రెడ్డి డిమాండ్

**శ్రీకాళహస్తి, జయజయహే (ఆగస్టు 07):**

డీఎస్సీ 2025 నియామకాల్లో చోటుచేసుకున్న తీవ్ర అక్రమాలపై తక్షణమే సిబిఐ విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని శ్రీకాళహస్తి వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు డీఎస్సీ అక్రమాలకు నిరసనగా శ్రీకాళహస్తి పార్టీ కార్యాలయం వద్ద చేపట్టిన 'ఏపీ +వఅ- ఔుతీ' రిలే నిరాహార దీక్షలు రెండవ రోజుకు చేరాయి. ఈ దీక్షలకు ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా సహాయ కార్యదర్శి కోగిలి మునిచందు, విద్యార్థి సంఘ నాయకులు హాజరై పూర్తి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బియ్యపు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం స్పోర్ట్స్ కోటా పేరిట అర్హత లేని టీడీపీ కార్యకర్తలకు, నకిలీ సర్టిఫికేట్లు ఉన్నవారికి డీఎస్సీ ఉద్యోగాలను అంగట్లో సరుకుల్లా పంచిపెట్టిందని మండిపడ్డారు. అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలనే తాము పోరాడుతున్నామని స్పష్టం చేశారు. అలాగే 20 లక్షల మంది నిరుద్యోగులకు ఇవ్వాల్సిన రూ.2000 కోట్ల బకాయిల నిరుద్యోగ భృతిని వెంటనే విడుదల చేయాలని, నిలిచిపోయిన ఫీజు రీయింబర్స్మెంట్, వసతి దీవెన నిధులను చెల్లించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు జరిగాయని, ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థులను, నిరుద్యోగులను మోసం చేస్తోందని విమర్శించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, నియోజకవర్గ పరిశీలకులు ఓడూరు గిరిధర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



# పుష్కరాలకు పటిష్ట భద్రత.. మార్గాలపై అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

**రాజమహేంద్రవరం: జయ జయహే:**

ఆగస్టు7:రానున్న గోదావరి పుష్కరాలు--2027ను దృష్టిలో ఉంచుకుని భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ఏర్పాట్ల కోసం తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరితో కలిసి రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లోని ప్రధాన రహదారులు, ప్రత్యామ్నాయ మార్గాలు, ట్రాఫిక్ డైవర్షన్ రూట్లు, పుష్కర ఘాట్ల అనుసంధాన మార్గాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్, అత్యవసర సేవల వాహనాల రాకపోకలు, బ్యారికేడింగ్, సూచిక బోర్డులు, పాదచారుల మార్గాలు, భద్రతా ఏర్పాట్లపై అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.ఈ పరిశీలనలో అదనపు ఎస్పీ (అడ్మిన్) పాటిల్ దేవరాజ్ మనీష్, జాయింట్ కలెక్టర్ వై. మేఘ స్వరూప్, పోలీసు అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఘుగర్ ఫ్యాక్టరీల భూములు అమ్మకాలు నిలుపుదల చేయాలి

**నక్కపల్లి జయ జయహే**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అనకాపల్లి జిల్లా తాండవ, ఏటి కొప్పాక, విజయనగరం జిల్లా భీమ సింగ్ కోపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీల భూములను ఏపిఐఐసికి అమ్మకానికి పెడుతూ గురువారం నిర్ణయం తీసుకుంది దీనిని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈసందర్భంగా ధర్మవరం అగ్రహారం గ్రామంలో రైతులతో కలిసి ఎం.అప్పలరాజు మాట్లాడుతూ కోపరేట్ షుగర్ ఫ్యాక్టరీల భూములు పై ప్రభుత్వానికి ఎటువంటి అధికారం లేదని, ప్రభుత్వం కేవలం ప్రమోటర్, సలహాదారు మాత్రమే అటువంటిది, రైతుల మహాజన సభ, రైతుల యొక్క ఆమోదం లేకుండా ఏకపక్షంగా ఎలా నిర్ణయం తీసుకుంటారని ప్రశ్నించారు.ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో షుగర్ ఫ్యాక్టరీలను ఆధునికరించి తెరిపిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత స్వయానా రాష్ట్ర ముఖ్యమంత్రి 2024 జూలై 11 వ తేదీన ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీ ప్రక్కనే ఉన్న పోలవరం ఎడమ కాలువ సందర్శించిన సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ తాండవ,ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీలను కూటమి ప్రభుత్వం తెలిపించి, ఆధునీకరించి నడిపిస్తామని దానికి అనకాపల్లి ఎంపీ , రాష్ట్ర హోం శాఖ మంత్రి బాధ్యత తీసుకుంటారని సభలో ప్రకటించారు. ఈరోజు ఆ ప్రకటనకు, హామీ లకు కూడా ఏ మాత్రం కట్టుబడకుండా షుగర్ ఫ్యాక్టరీల భూములను అమ్మడానికి సిద్ధ పడటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇప్పటికే 29 షుగర్ ఫ్యాక్టరీల లో 26 షుగర్ ఫ్యాక్టరీలను మూసివేసారని, ఇప్పుడు పైగా మూడు ఫ్యాక్టరీల భూములు అమ్మడానికి సిద్ధపడటం చూస్తే అధికారంలో ఉంటే ఒక లాగా, ప్రతిపక్షం లో ఉంటే ఒక లాగా మాట్లాడుతూ పాలన చేస్తున్నారు. వెంటనే కోపరేటీవ్ షుగర్ ఫ్యాక్టరీల భూములు అమ్మకాలు ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు లు ఎన్.సూరిబాబు, ఎన్.ఆంజనేయులు, బి.వరహాలు, కె.లక్ష్మణ్,ఎస్.వెంకటేష్,యు.లోవరాజు, ఎస్ .సాయి పాల్గొన్నారు

# గిరిజనుల అభ్యున్నతికి సమిష్టి కృషి చేయాలి

**- ఎస్టీ వర్గాల సంక్షేమం, ఉపాధి, విద్యపై ప్రత్యేక దృష్టి అవసరం**

**- ఏపీ శాసన సభ షెడ్యూల్డ్ తెగల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ మిరియాల శిరీషా దేవి**

**విశాఖపట్నం, ఆగస్టు 6, జయ జయహే**

గిరిజనుల అభ్యున్నతికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి సంక్షేమ కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభ షెడ్యూల్డ్ తెగల సంక్షేమ కమిటీ ఛైర్‌పర్సన్ మిరియాల శిరీషా దేవి అధికారులను ఆదేశించారు. జిల్లా పర్యటనలో భాగంగా గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. గిరిజన విద్యార్థుల




విద్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, రోస్టర్ పాయింట్ల అమలు, గృహనిర్మాణం, పింఛన్లు, స్వయం సహాయక సంఘాలకు అందిస్తున్న రుణాలు, గిరిజన సంక్షేమ పథకాల అమలుపై కమిటీ సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. కేజీహెచ్‌కు గిరిజన ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో రోగులు వస్తున్నందున వారికి ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని కమిటీ సూచించగా స్పందించిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ కేజీహెచ్‌లో గిరిజనుల కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి అన్ని రకాల సేవలు అందిస్తున్నామని వివరించారు. కమిటీ సభ్యుడు నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ గిరిజన సమావేశంలో కమిటీ సభ్యులు పేరాబత్తుల రాజశేఖరం, నిమ్మక జయకృష్ణ, రేగ మత్స్యలింగం, జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్, జీసీసీ ఎండీ శోభిక, అసెంబ్లీ జాయింట్ సెక్రటరీ పి.వి. సుబ్బారెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ యు. నాగమునియ్య, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విశ్వేశ?వరనాయుడుతో పాటు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు



## భక్తిశ్రద్ధలతో పళని క్షేత్రానికి కావడి యాత్ర ప్రారంభించిన కారణి గ్రామ భక్తులు

**బుచ్చినాయుడు కండ్రిగ, జయజయహే (ఆగస్టు 07):**

బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని కారణి గ్రామం నుండి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి మొక్కుబడులను తీర్చుకునేందుకు భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో కావడి యాత్రను ప్రారంభించారు. కుమారస్వామి అనుగ్రహం కోసం ఏటా సాంప్రదాయబద్ధంగా సాగే ఈ యాత్రలో భాగంగా, గ్రామానికి చెందిన పలువురు స్వాములు కఠిన ఉపవాస దీక్షలను ఆచరించి, పవిత్ర కావళ్లను తమ భుజస్కంధాలపై మోస్తూ తమిళనాడులోని ప్రసిద్ధ పళని క్షేత్రానికి కాలినడకన ప్రయాణమయ్యారు. యాత్ర ప్రారంభానికి ముందు గ్రామ దేవాలయాల్లో స్వామి వారికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించి, మంగళవాయిద్యాలు, హరహరోహరా అనే ఆధ్యాత్మిక నామస్మరణల నడుమ భక్తులు కావళ్లతో ముందుకు సాగారు. మురుగన్ దేవునిపై అచంచలమైన విశ్వాసంతో, లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ కాలినడకన సాగే ఈ పవిత్ర ప్రయాణంలో పాల్గొన్న భక్తులను గ్రామస్తులు, మహిళలు కర్పూర హారతులతో సాదరంగా సాగనంపారు. ఈ పవిత్ర ఆధ్యాత్మిక యాత్రా మహోత్సవంలో కారణి గ్రామానికి చెందిన భక్తులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి దివ్య కృపాకటాక్షాలు పొందారు.




## ఆర్‌ఈసిఎస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు న్యాయం చేయాలి

**అనకాపల్లి జయ జయహే**

స్థానిక ఆర్ఇసిఎస్ లో గత 20 నుంచి 35 సంవత్సరాలుగా సిపిడబ్ల్యూ గా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగు లు తమకు ఎటువంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా జూలై నెల వేతనాల్లో కోత విధించడం పై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణను కలిసిన ఉద్యోగస్తులు తమకు న్యాయం చేయాలని కోరుతూ రామకృష్ణ కు విజ్ఞప్తి చేయడం జరిగింది. ఉద్యోగస్తులు ఎమ్మెల్యే రామకృష్ణతో మాట్లాడుతూ తమ బాధలు చెప్పుకుంటూ తమకు ఆర్ ఇ సి ఎస్ ద్వారానే నేరుగా వేతనాలు చెల్లిస్తున్నప్పటికీ తమను పొరుగు సేవల ఒప్పంద కార్మికులకు పరిగణిస్తున్నారని దశాబ్దాలుగా సంస్థకు సేవలు అందిస్తున్న తమకు ఎటువంటి లిఖితపూర్వకంగా సమాచారం లేకుండా ముందస్తు నోటీసులు లేకుండా జూలై నెలలో వేతనాల్లో కోత విధించడం తీవ్ర అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఈనెల ఆరవ తేదీన మేనేజింగ్ డైరెక్టర్ జూలై నెలలో తగ్గించిన వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఆగస్టు 7వ తేదీ నాటికి పలు ఉద్యోగులు ఖాతాలో 847 రూపాయలు చొప్పున కోతకు గురై మొత్తం జమ కాలేదని వారు పేర్కొన్నారు అలాగే యాజమాన్యం అమలు చేస్తున్న నిబంధనలను ఉద్యోగులకు ఉద్దేశ పూర్వకంగానే తెలియజేయడం లేదని దీనివల్ల ఉద్యోగుల్లో అయోమయం నెలకొంటుందని వారు పేర్కొన్నారు జూలై నెలలో తగ్గించిన వేతనాలు వెంటనే పూర్తిగా చెల్లించాలని తక్కువ వేతనాలతో పనిచేస్తున్న ఉద్యోగుల జీతాలను తక్షణమే పెంచాలని ఉద్యోగులకు అందరికీ 12 శాతం ప్రావిడెంట్ ఫండ్ అమలు చేయాలని మరియు సేవా నిబంధనలు మరియు అమలులో ఉన్న అన్ని నియమాలను జరిగేలా ప్రభుత్వం మరి సంబంధిత అధికారులు దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేయాలని ఎమ్మెల్యే రామకృష్ణ కు తమ బాధను తెలియ చెప్పడం జరిగింది మాకు నాయ్యం మీరే చేయాలని వారిని కోరడం జరిగింది

## వైకాపా రెండవ రోజు రిలే నిరాహార దీక్ష.

**శ్రీకాళహస్తి, ఆగస్టు 07,జయ జయహే.**




శ్రీకాళహస్తి పట్టణ వైయస్సార్సీపి పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు రిలే నిరాహార దీక్ష చేశారు. శ్రీ కాళహస్తి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏపీ జెన్ జెడ్ రిలే నిరాహార దీక్ష చేశారు. కార్యక్రమానికి ఏర్పేడు, రేణిగుంట, తొట్టంబేడు మండలాల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమంలో కాళహస్తి స్వామి వారి దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, శ్రీ కాళహస్తి నియోజకవర్గ పరిశీలకులు ఓడూరు గిరిధర్ రెడ్డి, అడ్వకేట్ దశరథ రామిరెడ్డి,తొట్టంబేడు మండల అధ్యక్షులు ఉన్నం వాసుదేవ నాయుడు, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి, జడ్పిటిసి సంధ్య, ఏర్పడ మండల ఇంచార్జ్ గున్నేరి కిషోర్ రెడ్డి, ఏర్పేడు మండల ప్రెసిడెంట్ రమణయ్య యాదవ్, మడిబాక పంచాయతీ వైస్సార్సీపీ కన్వీనర్ గెంజి రవియాదవ్,కడివెళ్ళ జనార్ధన్ రాజు మధుసూదన్ రాజు, చలంరాజు, గుండ్రాజు సుధాకర్ రాజు వైస్సార్సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## గ్రామీణ యువజన మందిరం వార్షికోత్సవ ఏర్పాట్లు

**మునగపాక, ఆగస్టు 7, జయ జయహే:**

గ్రామీణ యువజన మందిరం 62వ వార్షికోత్సవం వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లు చేపడుతోందని మందిరం అధ్యక్షుడు ఆడారి శ్రీకాంత్ తెలిపారు. మునగపాక గ్రామీణ యువజన మందిరంలో శుక్రవారం మీడియా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు, 11న ఉత్తరాంధ్రస్థాయి వాలీబాల్ పోటీలు, 14న సీనియర్ కళాకారులకు సన్మానం ఉంటుందని చెప్పారు. అనంతరం హైదరాబాద్ కు చెందిన గోవాడ క్రియేషన్స్ కళాకారులచే "అమ్మ చెక్కిన బొమ్మ", మునగపాక నటరాజ్ కళాకారులు చీకటిబాట నాటిక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. 15న ఉదయం జెండా ఆవిష్కరణ అనంతరం ఆటలు పోటీలు, రాత్రికి కూచిపూడి, భరతనాట్యం, బాలరామాయణం ప్రదర్శనలుతో పాటు సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ విచ్చేయనున్నారని, ఆయన చేతులు మీదుగా విజేతలకు బహుమతులు ప్రధానోత్సవం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో మందిరం ఉప అధ్యక్షుడు మల్ల జోగారావు, కార్యదర్శి ఆడారి సూర్య చంద్ర రామారావు, కోశాధికారి ఆడారి లక్ష్మణరావు, కల్చరల్ విభాగం ఆడారి రాంబాబు, డైరెక్టర్లు పెంటకోట జగన్నాధరావు, బుద్ధ నాగు తదితరులు పాల్గొన్నారు.



## అధికారికంగా లక్ష్మణ స్వామి వర్మ జన్మదిన వేడుకలు నిర్వహణ

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బీసీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ జిల్లా అధికారి శ్రీదేవి ఆధ్వర్యంలో అగ్నికుల క్షత్రియుల జాతి పితామహులు పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ జన్మదిన సందర్భంగా శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రభుత్వం ప్రకటించడంతో కలెక్టర్ ఆఫీసులో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ జాతి పితామహులు లక్ష్మణస్వామి వర్మ చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించడం జరిగింది ఆమె మాట్లాడుతూ బీసీ కులాలకు చెందిన లక్ష్మణస్వామి వర్మ జన్మదిన వేడుకలు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా మొట్టమొదటిసారి చేయడం చాలా శుభపరిణామని ఆనందించినంత తగిన విషయమని ఆమె పేర్కొన్నారు గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లోని ప్రప్రథమంగా కోరంగి గ్రామంలో 1890లో 120 రకాల ఆయుర్వేద ఔషధం లు తయారుచేసి ఒక పెద్ద ఔషధాలయం ఏర్పాటు చేశారని ఆ రోజుల్లో 8 ఎకరాలు పంట పొలాలను ప్రజా అవసరాలకు దానంగా ఇచ్చారని అటువంటి మహోన్నత వ్యక్తి లక్ష్మణ స్వామి వర్మ జీవితం అందరికీ ఆదర్శంగా నిలిచారని ఆయన ఆదర్శాలు కొన్ని తీసుకొని ప్రజలందరూ నడవాలని మల్ల సురేంద్ర పేర్కొన్నారు జన్మదిన వేడుకలు ఈ రోజున జరుపుకోవడం అది ప్రభుత్వం అధికారికంగా ప్రకటించను మంచి శుభ పరిణామం అని పేర్కొన్నారు




## మానవిధికర్ సామాజిక మంచ్ సంస్థ సమావేశం

**నక్కపల్లి జయ జయహే**

నక్కపల్లి మండలం డి ఎల్ పురం గ్రామంలో ఫిషర్స్ మాన్ కాలనీలో మానవిధికర్ సామాజిక మంచ్ సంస్థ సమావేశం నిర్వహించారు స్టీల్ ప్లాంట్ కు వచ్చే పైప్ లైన్ పనులు భూసేకరణ అంశాలపై చర్చ జరగక పైప్ లైన్ కు అడ్డంగా ఉన్న ఇల్లు మెరుగు జండాలమ్మ కుటుంబ సభ్యులు వచ్చి పెంకిటిల్లులో కాపురం ఉంటున్న సభ్యులు వచ్చి మాకు ఇంకా ఇంటి తాలూకా ఎస్టిమేషన్ అమౌంట్ ఇంకా రాలేదు పిడిఎఫ్ లిస్టు అనగా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ మా పేర్లు రాలేదని తెలుపుకున్నారు ఆర్ అండర్ డిపార్ట్మెంట్ వచ్చి సుమారు 11 లక్షలు రూపాయలు ఎస్టిమేషన్ వేసారని అమౌంట్ రెవిన్యూ డిపార్ట్మెంట్ ఇంకా వెయ్యలేదని చెప్పుకున్నారు అలాగే పైప్ లైన్ జరిగే ప్రాంతంలో చేపల దేవుడమ్మ కారే బంగారం తల్లి వారికి సాగు భూమికి ఇంకా పరిహారం వెయ్యలేదని ఈ సమావేశంలో స్థానిక నాయకులతో కలిసి చెప్పుకున్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాజీ ఎంపీటీసీ గంటపల్లి చిన్న కోసం సిరిపిల్లి చిరంజీవి చొక్కా జగ్గారావు పాల్గొన్నారు




## విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలి

**వైసిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్**

**మునగపాక, ఆగస్టు 7, జయ జయహే:**

ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో అచ్యుతాపురం కేంద్రంలో జరుగుతున్న వైసీపీ ఉద్యమం, మెగా డీఎస్సీను దగా డిఎస్సీగా మార్చిన రాష్ట్ర విద్యా శాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని అచ్యుతపురంలో చేస్తున్న దీక్షలకు మునగపాక నుండి అధిక సంఖ్యలో నిరుద్యోగ అభ్యర్థులు, వైసిపి కార్యకర్తలు నాయకులు తరలి వెళ్లారు. మునగపాకలో ఈ ప్రదర్శనను అనకాపల్లి వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ప్రారంభించి, వారిని ఉద్దేశించి మాట్లాడుతూ నిరుద్యోగ డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకూ వైసీపీ తరఫున, పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఉద్యమం కొనసాగుతుందని ప్రసాద్ తెలిపారు. అచ్చుతాపురం తహసిల్దార్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున రిలే నిరాహార దీక్ష రెండో రోజు కొనసాగింది.

# రైతన్న మీకోసం, ఎల్ ని నో ప్రభావం నివారణ - కార్యచరణ ప్రణాళిక-

**అచ్యుతాపురం, ఆగస్టు 7, జయ జయహే:**

ఎలమంచిలి నియోజకవర్గం తేరువుపల్లి గ్రామంలో రైతన్న మీకోసం ఎల్ నినో ప్రభవ నివారణ, కార్యాచరణ ప్రణాళిక మీద ఎలమంచిలి నియోజకవర్గ శాసన సభ్యులు సుందరపు విజయకుమార్ సమగ్ర క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమం ఈ నెల 7వ తేదీన తెరువుపల్లి గ్రామం నుంచి ప్రారంభించారు. ప్రతి రైతు సేవ కేంద్ర పరిధిలోని ప్రతి రైతును ప్రతి వ్యవసాయ భూమాతను సందర్శించి పంటల స్థితిగతులను నిర్ధారించుట, పంటల ప్రస్తుత పరిస్థితి నీటి కొరత వలన వాడిపోవడం , ఎండిపోవడం చేయడ పీడల ఉధృతి వివరాలను అంచనా వేస్తూ క్షేత్రస్థాయిలో గుర్తించిన కరువు పరిస్థితులకు తగువిధంగా నివారణ చర్యలు పంటను కాపాడుకునేందుకు తక్షణమే ఇవ్వవలసిన ప్రాణాధార నీటి తడులు మల్చింగ్ పంటలు అంతర పంటల సాగు చర్యలు సూచిస్తూ, బీడీగా ఉన్న సాగు చేపట్టిన పొలాల్లో స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటలు బీడు స్వల్పకాలిక రకాలను విత్తుకునే విధంగా ప్రోత్సహిస్తూ, ఏపీ ఏఐఎంఎస్ 2.0 ద్వారా



పారదర్శకంగా ఎరువులను పర్యవేక్షించడం మరియు ఫార్మర్ యాప్ ద్వారా రైతులు అవసరమైన సలహాలు సూచనలు అందజేయడం మరియు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వేసిన పిఎండిఎస్ క్షేత్ర సందర్శన ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి, అలాగే పంటల బీమా ఒక ఎకరానికి 84 రూపాయలు చొప్పున ఇన్సూరెన్స్ చేయించుకోవాలని నియోజకవర్గంలోని ప్రతి రైతులు ఈ సద్వినియోగం చేసుకోవాలని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మోహన్ రావు, దీన బంధు, సన్యాసిరావు, రంగ నాయకులు, లాలం సోము నాయుడు, రమేష్, శంకర్రావు, నాయుడు బోజ జయరాం మరియు వ్యవసాయ విస్తరణ అధికారులు దేవుడు మోహన్ భాస్కర్ తదితర రైతులు పాల్గొన్నారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com